J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 19 13.10.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## • తెలుగు రాష్ట్రాలలో రాజకీయ సందడి

# అక్కడ పోరు - ఇక్కడ జోరు



## స్పీడు పెంచిన కేసీఆర్

ఒక్కసారిగా రెండు తెలుగు రాష్ట్రాలలో రాజకీయ సందడి మొదలయ్యింది. తెలంగాణలో డిసెంబర్‌కి బదులుగా నవంబరు 30 నాటికే ఎన్నికల తంతు ముగిసిపోయేలా ప్రధాన ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చేసింది. అక్కడ అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకత్వానికి ఇది ఊహించని షాక్. దీంతో, తెలంగాణ ఓటర్లకు కొత్త తాయిలాలు, ప్రభుత్వపరంగా పథకాలు ప్రకటించే అవకాశం ఆ పార్టీకి లేకుండాపోయింది. గత కొన్ని రోజులుగా ఎలాంటి రాజకీయ ఉపన్యాసాలు, పర్యటనలు చేయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కే.సి.ఆర్ ఒక్కసారిగా స్పీడు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలకి, బహిరంగ సభలకి తేదీలు ప్రకటించి కదనరంగంలో దూకారు.

## > భారీగా బదిలీలు



# 'మోషా'ల లీలలు

తెలంగాణ ఎన్నికల నగారా మోగిన వేళ ఉన్నట్లుండి కల్వకుంట్లకి పెద్ద షాకిచ్చింది ఎన్నికల కమిషన్. ఒక్కసారిగా 20మంది కీలక అధికారులను బదిలీ చేసింది. ఇది మోడీ అమిత్ షాల వ్యూహంలో భాగమే అన్న సంగతి చంటిపిల్లాడిని అడిగినా చెప్తారన్నది విశ్లేషకుల అభిప్రాయం. అయితే, రేపు ఇదే ఫార్ములా ఆంధ్రాలో కూడా వాడతారా...? లేకపోతే తమతో భుజం రాసుకు తిరుగుతున్న జగన్‌ని పోనిలే పాపం అని వదిలేస్తారా..? అంతేకాదు... ఆంధ్రా ఎన్నికలలో బీజేపీ స్టాండు ఏంటి...?? పవన్‌తో కలిసి టీడీపీతో వెళ్తారా.. మీరిద్దరూ కొట్టుకోండి అని గోడ మీద కూర్చుంటారా..? ఇవన్నీ మిలియన్ డాలర్ల ప్రశ్నలే. తెలంగాణ ఫార్ములాని గమనిస్తే అక్కడ కేసీఆర్ - జగన్ మంచి మిత్రులు. వీరిద్దరికీ కామన్ శత్రువులు టీడీపీ, కాంగ్రెస్. ఆంధ్ర వరకూ వస్తే జగన్, బీజేపీ మిత్రులు. టీడీపీ, జనసేన, కాంగ్రెస్ మాత్రమే జగన్ శత్రువులు. ఇలాంటి పరిస్థితులలో ఆంధ్రాలో బీజేపీ వ్యూహం చాలా కీలకం. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలతో ఆంధ్ర టీడీపీ శ్రేణుల్లో ఆశలు చిగురిస్తున్నాయంటున్నారు విశ్లేషకులు.

10లో



## దశ, దిశ నిర్దేశించిన జగన్

ఆంధ్రాలో ఎన్నికలకి ఇంకా ఆరు నెలల గడువు ఉంది. అయినప్పటికీ వైసీపీ ముందుగానే సమర శంఖం పూరించింది. తమ పార్టీ శ్రేణులని ఎన్నికల యుద్ధానికి సిద్ధంచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అక్టోబర్ 9వతేదీ విజయవాడలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రతినిధుల సదస్సు పేరుతో భారీ సమావేశాన్ని ఆ పార్టీ జరిపింది. ప్రభుత్వంలోను, పార్టీలోను రాష్ట్రవ్యాప్తంగా వివిధ హోదాలలో ఉన్న దాదాపు పదివేలమంది పార్టీ నేతలు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. రానున్న ఆరు నెలల కాలంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో పార్టీ ఇతర అన్ని విభాగాల పార్టీ సైన్యం చేయవలసిన పనులను ముఖ్యమంత్రి జగన్ వివరించారు. జోరు పెంచి పోరు కోసం సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు.

10లో




# ఆస్ట్రేలియాలో నెల్లూరీయుల ఘనత

## > స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ అయిన మనోళ్ళ సంస్థ

## > మైనింగ్ విభాగంలో గుర్తింపు పొందిన 'ఫస్ట్ లిథియం'



ఆస్ట్రేలియాలో పెత్ నగరంలోని స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో "ఫస్ట్ లిథియం" సంస్థ డైరెక్టర్లతో వ్యవస్థాపక భాగస్వాములు మనోజ్ నంబూరు, సునీల్ బొమ్మిరెడ్డి.

ఇప్పటికే పలు ప్రపంచదేశాలలో వ్యాపార, వాణిజ్య రంగాలలో తమ ప్రతిభను ప్రదర్శిస్తూ, ఉత్తమ వ్యాపారవేత్తలుగా రాణించడంలో అగ్రగణ్యులుగా నిలుస్తున్నారు మన నెల్లూరీయులు. తాజాగా మన నెల్లూరుకు చెందిన 'ఫస్ట్ లిథియం' సంస్థ "ఏఎస్ఎక్స్"(ఆస్ట్రేలియా స్టాక్ ఎక్స్ఛేంజ్)లో స్థానం పొంది లిస్టింగ్ కాబడింది. నెల్లూరుకు చెందిన నంబూరు మనోజ్, ఆల్తూరు మహేష్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సునీల్‌లు 2008లో ఆస్ట్రేలియాలో మైనింగ్ విభాగంలో 'ఫస్ట్ లిథియమ్' అనే వ్యాపార సంస్థని ప్రారంభించారు.

3 లో



# డాక్టర్ బిందుమీనన్‌కు.. ఎన్ఏఎంఎస్ ఫెలోషిప్

నెల్లూరులోని ప్రముఖ న్యూరాలజిస్ట్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. ఈనెల 7న బెంగుళూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎన్ఏఎంఎస్) 63వ వార్షికోత్సవంలో ఆమె ఈ ఫెలోషిప్‌ను అందుకున్నారు. వైద్యరంగంలో పరిశోధనలు, ప్రచురణలు, పలు సమావేశాల్లో పాల్గొనడం, సైంటిఫిక్ కమిటీలో ఉండడంతో పాటు ఆమె చేస్తున్న సమాజసేవలకు గుర్తింపుగా ఈ అవార్డు బహుకరించారు. కర్నాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ప్రొఫెసర్ ఎస్‌పి సింగ్ బఘెల్ తదితరులు పాల్గొన్నారు.

# భాస్కర్‌రావును అభినందించిన కలెక్టర్



జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, నెల్లూరులోని కొండాయపాళెం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేకల భాస్కర్‌రావును ఇటీవల జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అభినందించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, చిన్నతనంలోనే పోలియోవ్యాధి బారినపడినప్పటికీ, ఆత్మస్థైర్యంతో గత 23 సంవత్సరాలుగా ఉపాధ్యాయవృత్తిలో క్రమశిక్షణతో పనిచేస్తూ, రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న భాస్కర్‌రావు సేవలను కలెక్టర్ కొనియాడుతూ, ఆయనకు లక్ష రూపాయల నగదు పురస్కారాన్ని కూడా ప్రకటించారు.

# తహాశీల్దార్ల బదిలీలు

జిల్లాలో తాజాగా పలువురు తహాశీల్దార్ల బదిలీలు జరిగాయి. సెక్రటేరియట్ నుంచి జిల్లాకు శిక్షణకు వచ్చిన డెప్యూటికలెక్టర్ హనోక్ ఏఎస్‌పేట తహాశీల్దార్‌గా నియమితులయ్యారు. ఏఎస్‌పేట తహాశీల్దార్ ఏవీ రమణరావును వరికుంటపాడుకు బదిలీ చేశారు. ఉదయగిరి తహాశీల్దార్‌గా పనిచేసిన వి.జగదీష్‌బాబు ఆత్మకూరు తహాశీల్దారుగా, ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్.రామ్మోహన్‌రావును దుత్తలూరు తహాశీల్దార్‌గా నియమించారు.

# ఆర్మీలో చేరండి..దేశసేవ చేయండి

## యువతకు మేజర్ శ్వేత ఉపాధ్యాయ పిలుపు



ఆర్మీలో చేరండి, దేశసేవ చేయండి అంటూ మేజర్ శ్వేత ఉపాధ్యాయ యువతకు పిలుపునిచ్చారు. ఇటీవల ఆమె అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణపట్నం, ముత్తుకూరు, ఈపూరు వెంకన్నపాళెం, అదాని విద్యామందిర్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో సమావేశమై ఆర్మీపై అవగాహన కలిగించారు. ఆర్మీలో ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆర్మీలో చేరినవారికి ఎలాంటి ఉన్నత అవకాశాలు వస్తాయో వివరించారు. కల్నల్ గంగా సతీష్, అరుణ్, రాహుల్ పాల్గొన్నారు.

# స్నేహితుని స్మారకంగా..రక్తదానం



మూడేళ్ల క్రితం ప్రమాదవశాత్తూ మరణించిన తమ స్నేహితుడు పుల్లా నాగరాజు పుట్టినరోజున రక్తదానం చేసి ఆ మిత్రులు తమ స్నేహాన్ని సార్థకం చేసుకున్నారు. ఇటీవల ఆయన మిత్రులు బాలాజీ, శశిధర్, సాయిగౌతమ్, శశి, రవి, సుభాషిణి తదితరులు 51 మంది కావలి రెడ్‌క్రాస్ రక్తనిధిలో రక్తదానం చేశారు. నాగరాజు తండ్రి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తమ కుమారునికి రక్తదానమంటే ఎంతో ఇష్టం కనుక, రక్తదానంతోనే ఆత్మశాంతి కలుగుతుందని భావించి అందరం కలసి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు.

# మతోన్మాదులను ఓడించాలి

రానున్న ఎన్నికల్లో మతోన్మాదులను, వారికి మద్దతునిచ్చేవారిని ఓడించాలని ఆంధ్రప్రదేశ్ శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఈనెల 8న నెల్లూరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన మహిళా సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సనాతన ధర్మం కాదు, సమాన ధర్మం కావాలన్నారు. పాఠశాలలను విలీనం చేయడం వల్ల బాలికలు చదువుకు దూరమవుతున్నారని యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర నాయకురాళ్ళు నాగమణి, శ్రీదేవి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆపోలోలో రాయితీతో వైద్యపరీక్షలు



నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈనెల 10వ తేదీ నుండి పేద, మధ్యతరగతి రోగులకు వెసులుబాటుగా ఉండేలా ఒక ప్రత్యేక ప్యాకేజ్ అందుబాటులోకి వచ్చింది. ప్రపంచ ఆర్థరైటీస్ డే సందర్భంగా, 5 వేల రూపాయలు విలువైన ఏడు రకాల మోకాలి సమస్యల పరీక్షలను కేవలం 999 రూపాయలకే చేయనున్నారు. అక్టోబరు 31వ తేదీ వరకూ ఈ రాయితీ అమల్లో ఉంటుందని అపోలో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ సిహెచ్ వివేకానందరెడ్డి, డాక్టర్ ఎం. శశిధర్, డాక్టర్ చరణ్, డాక్టర్ నవీన్ తెలిపారు. ఈ అవకాశాన్ని మోకాలి నొప్పి సమస్యలు ఎదుర్కొనే రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మందుబాబులకు జరిమానాలు

తాగి వాహనాలు నడపొద్దంటూ ఎంతగా చెప్తున్నా పట్టించుకోకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మందుబాబులకు ఇటీవల న్యాయస్థానం జరిమానాలు వడ్డించింది. నెల్లూరు చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసుల్లో సాయి శ్రీనివాసులు, జి.భాస్కర్, చలపతి, సమీరుల్లా, వేణుగోపాల్, ముక్తియార్, హనీఫ్, భగత్‌సింగ్, నాయక్ అనే 9మందికి ఒక్కొక్కరికి 10వేల రూపాయల వంతున జరిమానాలను విధిస్తూ న్యాయమూర్తి శారదారెడ్డి తీర్పుచెప్పారు.

# న్యాయవాది మురళి.. కన్నుమూత

ప్రముఖ న్యాయవాది, నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు బి. మురళి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు ఉమామహేశ్వర్, సుందరయ్యయాదవ్ తదితరులు ఆయన మృతికి విచారిస్తూ, వారి కుటుంబానికి సంతాపం తెలిపారు.



# మాస్కోలో కుస్తీ పోటీలకు.. వేగూరు యువకుడు

కోవూరు మండలం వేగూరు గ్రామానికి చెందిన యువకుడు ఎం.నరేంద్ర రష్యాలోని మాస్కోలో జరుగనున్న అంతర్జాతీయ కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో బంగారుపతకం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికై, ఢిల్లీలో జరిగిన జాతీయ పోటీల కుస్తీలోనూ 54 కేజీల విభాగంలో రాణించి అక్కడ కూడా బంగారుపతకం సాధించాడు. దీంతో నవంబరు 18,19 తేదీల్లో మాస్కోలో జరిగే జూనియర్ వరల్డ్ కుస్తీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు ఇటీవల వేగూరుకు వచ్చిన నరేంద్ర తెలిపాడు. ప్రస్తుతం తాను తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నానని, కోచ్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కుస్తీలో శిక్షణ పొందానని, మాస్కోలోనూ ప్రతిభతో రాణించి పతకం పొందడమే లక్ష్యంగా కృషి చేస్తున్నానని పేర్కొన్నాడు.

# రాహుల్‌ను కించపరచడం దారుణం

## • బీజేపీపై కాంగ్రెస్ నిరసన



కాంగ్రెస్ పార్టీ అధినేత, పార్లమెంట్ సభ్యుడు రాహుల్‌గాంధీని రావణాసురునితో పోలుస్తూ బీజేపీ నాయకులు పోస్టర్లు వెయ్యడం దారుణమని, బీజేపీ దిగజారుడు రాజకీయాలకు ఇది నిదర్శనమని జిల్లా కాంగ్రెస్ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. బీజేపీ చర్యలకు నిరసనగా ఇటీవల నెల్లూరులో కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఉడతా వెంకట్రావు, పీసీసీ సభ్యుడు తలారి బాలసుధాకర్ తదితరులు మాట్లాడుతూ, భారత్‌జోడో యాత్రతో రాహుల్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి బీజేపీ ఓర్చుకోలేకపోతోందన్నారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం ఖాయమన్నారు. కులాలు–మతాల మధ్య చిచ్చుపెడుతూ ప్రజల్లో ద్వేషాలు పెంచుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్రావ్, మోహన్‌రెడ్డి, గణేష్‌బాబు, నాగిరెడ్డి రాజేష్‌రెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారావు, నసీమా తదితరులు పాల్గొన్నారు.

# వివక్షను వీడాలి.. సమరసతను సాధించాలి

## శ్రీ కమలానందభారతి స్వామి



వివక్షను వీడి సమరసతను సాధించాలని భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామి పిలుపునిచ్చారు. ఈనెల 8న వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో ఉన్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆడిటోరియంలో నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల సమరసతా సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో స్వామీజీ మాట్లాడుతూ, సమాజంలో మార్పు కోసం మార్గదర్శనం అవసరమన్నారు. హిందూ ధర్మం భారతీయత సాధించేందుకు కులాలకు అతీతంగా అందరూ ఏకం కావాలన్నారు. జిల్లా సమరసత వేదిక అధ్యక్షులు నేలనూతల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనానికి పి.టి జగన్నాథాచారి అధ్యక్షత వహించారు. వేదిక ప్రధాన కార్యదర్శి కేశవ్, ఆర్ఎస్ఎస్ సహ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, పొట్లూరు శ్రీనివాసులు, డాక్టర్ వేణు దీక్షిత్, కోట సునీల్‌కుమార్, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కోడూరు సత్యం, జయప్రద, రామదండు, బాలు సుబ్బారావు, రమేష్‌రెడ్డి, ఎస్‌వి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు..ఏపీ జట్టు రెడీ



అక్టోబరు 13వ తేదీ నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే సీనియర్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్త క్రీడాకారులతో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ వారు పోటీలు నిర్వహించి ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపికచేశారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన ఈ ఎంపికలో ఏపీ జట్టుకు సూర్యతేజ, ఎస్.గుహనాథ్, ప్రకాష్, సాయిసంపత్, పృథ్వి, కనకరాజ్, శివశంకర్, దీపక్, తరుణ్‌కుమార్, సలీం, స్రవంత్‌కుమార్, హృదయరాజ్, రామకృష్ణ, దీపక్‌చంద్ర, జాకబ్, చక్రి, మనోజ్‌కుమార్, నివాస్, రాజేష్, అక్షయ్‌కుమార్, ముక్తియార్, ప్రమిత్‌లు ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.



# విజయవంతంగా.. 'గడప గడప'కు పూర్తి

## లక్షా 12 వందల ఇళ్ళు తిరిగిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని అలుపెరుగని దీక్షతో నిరంతరం నిర్వహించి, తమ నియోజక వర్గంలో కనీవినీ ఎరుగని విధంగా లక్షా 12వందల గడపలు తిరిగి, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాలపై ప్రజల అవగాహనకు కృషిచేసిన నేతగా కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల అభినందనలు అందుకుంటున్నారు. 204 రోజుల్లో లక్షకు పైగా గడపలు తిరిగి, ఆ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన ప్రజానేతగా ఆయన రికార్డు సాధించారు.

ఈ సందర్భంగా ఆయన పెద్దసంఖ్యలో ప్రజలను వారి ఇళ్ళ వద్ద కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకుని వారి కష్టాలేమైనా ఉంటే తీర్చేందుకు ఎంతగానో కృషి చేశారు. అసహాయులను, దివ్యాంగులను, తల్లితండ్రులను కోల్పోయిన అనాధలను, నిరుపేదలను ఎందరినో స్వయంగా పలకరించి, వారికి కావాల్సిన సాయాన్ని ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాదు, తమ తండ్రి దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధితులెందరికో లక్షలాది రూపాయల్లో మానవతా ధృక్ఫథంతో ఆర్థికసాయం కూడా అందజేసి ప్రజలందరికీ అభిమానపాత్రులయ్యారు.

గడప గడపకు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంగా ఇందుకూరుపేట మండలంలోని 'మొత్తలు' గ్రామంలో ఇటీవల తమ అభిమానులు, పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజల సమక్షంలో ఆయన కేకు కట్‌చేసి అందరికీ పంచారు. గ్రామస్తులు, స్థానిక ప్రముఖులు ఆయన్ను అభినందించి ఆశీస్సులందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక సంక్షేమ పాలన పట్ల ప్రజలు ఎంతో ఆదరాభిమానాలతో ఉన్నారని అన్నారు. గడప గడపకు కార్యక్రమాన్ని కోవూరు నియోజకవర్గంలో సంపూర్ణస్థాయిలో పూర్తిచేసినందుకు సంతోషంగా ఉందని, అందుకు సహకరించిన ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఆయా ప్రాంతాల్లోని అధికారులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్డీఏ ఛైర్మెన్ విజయకుమార్‌యాదవ్, జడ్పీ వైస్ ఛైర్‌ఫర్సన్ జయలక్ష్మి, వైకాపా నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, మావులూరు శ్రీనివాసులురెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, మహీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాలో నెల్లూరీయుల ఘనత

(మొదటి పేజీ తరువాయి)

అనూహ్యమైన ఖనిజ సంపద, నైపుణ్య వంతమైన భూగర్భ శాస్త్రవేత్తలు, ఆస్ట్రేలియాలో కొన్ని దశాబ్దాలుగా పలు మైనింగ్ సంస్థలలో పనిచేసిన అనుభవజ్ఞులైన సంస్థ కార్యనిర్వాహక బృందం, అనుకున్నది సాధించాలన్న తపన కలిగిన సంస్థ సారథుల సమిష్టికృషితో 'ఫస్ట్ లిథియమ్' ఆస్ట్రేలియా మైనింగ్ వ్యాపార రంగంలో గుర్తింపు సాధించింది.

## నిర్మాణ రంగంలోనూ అగ్రగాములుగా!

తమ నిర్మాణ, రియల్ ఎస్టేట్ సంస్థలు అలయన్స్, అర్బన్ రైజ్ సంస్థల ద్వారా యువ వ్యాపారవేత్తలు మనోజ్ నంబూరు, సునీల్ బొమ్మిరెడ్డిలు సంచలనాలని సృష్టిస్తున్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాదులలో తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. నాణ్యమైన నిర్మాణం, సమయ పాలన, సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే ధర తదితర అంశాలలో ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ తమ సంస్థలకి గుర్తింపు పొందారు. సొంత ఇంటి కలలు కనేవారి విశ్వాసాన్ని, నమ్మకాన్ని సాధించడంలో వారి సంస్థలు ప్రత్యేక స్థానాన్ని పొందాయి.

ఇప్పుడు ఆస్ట్రేలియా మైనింగ్ విభాగంలో గుర్తింపు పొంది మరోసారి తమ సత్తా చాటారు. ఆస్ట్రేలియా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో స్థానం పొందిన తొలి తెలుగు వారి సంస్థగా తమ ఫస్ట్ లిథియమ్ సంస్థని నిలిపారు. మన నెల్లూరు కీర్తి బావుటాని ఆస్ట్రేలియా వ్యాపార ప్రపంచంలో రెపరెపలాడించిన నంబూరు మనోజ్, ఆల్తూరు మహేష్, బొమ్మిరెడ్డి సునీల్‌లకి 'లాయర్' అభినందనలు.

# వైకాపా సమీక్షా సమావేశాలు



వైఎస్సార్‌కాంగ్రెస్ జిల్లా పార్టీ సమీక్షా సమావేశాలు ఈనెల 12న నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభమయ్యాయి. రాజ్యసభ సభ్యులు వైకాపా నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త విజయసాయిరెడ్డి పాల్గొని, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, రూరల్ నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాలు ఈనెల 13న కూడా జరుగనున్నాయి.

# ఆచార్య సీఎంకే రెడ్డి పుట్టినరోజు సంబరాలు



అక్టోబర్ 6 వతేది తమిళనాట తెలుగువారి ముద్దు బిడ్డ , తమిళనాడులో తెలుగువారి హక్కుల కోసం పోరాటం సాగించిన 'తలైవర్ ' ఆచార్య సి. ఎం. కే. రెడ్డి జన్మదినం సంధర్భంగా ఆయన అభిమానులు ఆయనని అభినందనల వెల్లువతో ముంచెత్తారు. వివిధ తెలుగు సంఘాలు, సాంస్కృతిక, సాహిత్య, కళా రంగాల ప్రతినిధులు, సీఎంకే రెడ్డి పూర్వ విద్యార్థినీవిద్యార్థులు, చెన్నై నగరంలోని అనేక మంది వివిధ రంగాల ప్రముఖులు ఆయనని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సీఎంకే రెడ్డి కుమారుడు డాక్టర్ కిషోర్ కూడా ఈ వేడుకలలో పాల్గొన్నారు.


దర్శించండి..! తరించండి...!!!

శ్రీ మాత్రే నమః:

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము

దుర్గామిట్ట, నెల్లూరు-4. సెల్ : 7382283735

తేది 15-10-2023 ఆదివారం నుండి

తేది 23-10-2023 సోమవారం వరకు



49వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వానము

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ శోభకృత్‌నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి ఆదివారము తేది 15-10-2023 నుండి ఆశ్వీయుజ శుద్ధ దశమి సోమవారము తేది 23-10-2023 వరకు నెల్లూరు, దుర్గామిట్టలో వెలసియున్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము నందు 49వ శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవములు శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వాముల వారి ఆశీస్సులతో ఆగమ శాస్త్రానుక్రమముగా నవాహ్నికముగా నిర్వహించబడి అత్యంత వైభవముగా జరుగును. ప్రతి దినము ఉదయం గం॥ 7-00 నుండి నవావరణము, అష్టోత్తరము, శ్రీదేవి ఖడ్గమాల పూజ, సహస్రనామ పూజలు జరుగును. విశేష పూజలలో భక్తులెల్లరు పాల్గొని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీ అమ్మవారి కరుణా కటాక్షములకు పాత్రులు కాగలరని కోరుచున్నాము.

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో ...

రత్నం జయరామ్
ఛైర్మన్ & వ్యవస్థాపక కుటుంబ సభ్యులు

అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

ధర్మకర్తల మండలి

గూడంశెట్టి దొరబాబు
మల్లు రామమోహన్ రెడ్డి
సన్నపురెడ్డి విజయకుమార్ రెడ్డి
కొండా సతీష్
శ్రీమతి మాలేపాటి పద్మజ
శ్రీమతి నీళ్ళ పెంచలమ్మ
శ్రీమతి చెంగామణి భారతి
శ్రీమతి మానికల నాగమణి
సూరాపర్చుల రఘురామమూర్తి
ఎక్స్ అఫిషియో మెంబర్

కలశ స్థాపన

తేది 15-10-2023 ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి ఆదివారము ఉదయం చిత్తా నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమునందు ఉ॥ 8-46 ని॥లనుండి గం॥ 8-50 ని॥ల లోగా కలశస్థాపన జరుగును.

వ్యవస్థాపక కుటుంబ సభ్యులు : శ్రీ రత్నం జయరాం - శ్రీమతి కళ్యాణమ్మ దంపతులు మరియు అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి మరియు ధర్మకర్తల మండలి సభ్యులు ఆధ్వర్యంలో కలశస్థాపన జరుగును.

అమ్మవారి దివ్య అలంకారముల వివరములు

| తేది | వారము | కార్యక్రమము |
|---|---|---|
| తేది 15-10-2023 | ఆదివారము పాడ్యమి | శ్రీ చండీ అలంకారము |
| తేది 16-10-2023 | సోమవారము- విదియ | శ్రీ భవాని అలంకారము |
| తేది 17-10-2023 | మంగళవారము- తదియ | శ్రీ గాయత్రి అలంకారము |
| తేది 18-10-2023 | బుధవారము- చవితి | శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారము |
| తేది 19-10-2023 | గురువారము - పంచమి | శ్రీ గజలక్ష్మి అలంకారము |
| తేది 20-10-2023 | శుక్రవారము - షష్ఠి | శ్రీ సరస్వతి అలంకారము |
| తేది 21-10-2023 | శనివారం - సప్తమి | శ్రీ కాళికా అలంకారము |
| తేది 22-10-2023 ఉదయం | ఆదివారము- అష్టమి | శ్రీ దుర్గా అలంకారము (దుర్గాష్టమి) |
| తేది 22 -10-2023 సాయంత్రం | ఆదివారము - మహర్నవమి | శ్రీ మహిషాసుర మర్ధిని |
| తేది 23-10-2023 | సోమవారము-విజయదశమి | శ్రీ రాజరాజేశ్వరి అలంకారం శమీపూజ, పారువేట, నగరోత్సవం |

విజయదశమి శుభాకాంక్షలతో...

గౌ॥ శ్రీ ఆదాల ప్రభాకర్ రెడ్డి గారు
మాజీ మంత్రివర్యులు, నెల్లూరు పార్లమెంటు సభ్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌వర్యులు

శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి గారు
ఆం.ప్ర. రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు

గౌ॥ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు
రాజ్యసభ సభ్యులు

గౌ॥ శ్రీమతి ఆనం అరుణమ్మ గారు
ఛైర్‌పర్సన్, జిల్లా ప్రజా పరిషత్

గౌ॥ శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గారు
నెల్లూరు రూరల్ శాసనసభ్యులు

గౌ॥ శ్రీ కొండ్రెడ్డి రంగారెడ్డి గారు
విజయ డైరి ఛైర్మెన్, నెల్లూరు జిల్లా

గౌ॥ శ్రీ బీదా మస్తాన్‌రావు గారు
రాజ్యసభ సభ్యులు

గౌ॥ శ్రీమతి పోట్లూరి స్రవంతి గారు
మేయర్, నెల్లూరు నగరపాలక సంస్థ

గౌ॥ శ్రీ ఆనం విజయకుమార్ రెడ్డి గారు
డి.సి.సి.బి. మాజీ ఛైర్మెన్, నెల్లూరు

లాయర్
అక్టోబర్ 13, 2023

# ఆసియా క్రీడల్లో అదరగొట్టిన భారత్

భారత క్రీడారంగంలో కొత్త శకం ఆరంభమైనట్లే. చైనా లోని హంగ్‌జౌలో ఇటీవల కళ్ళు జిగేల్‌మన్నట్లుగా మెరిసిపోయిన క్రీడావేదికపై జరిగిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆసియాక్రీడల్లో ఈసారి భారత్ తన సత్తాను చాటుకోవడం, అద్భుతమైన క్రీడాప్రతిభతో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సర్వత్రా ప్రశంసలందుకుంటోంది. పతకాల సాధనలో గతంలో ఎప్పుడూ లేనంతగా భారత క్రీడాకారులు విజృంభించడం, అద్భుతంగా ఆడి పతకాలెన్నో గెలవడం మంచిమార్పుకు సంకేతం. ఇప్పటిదాకా ఆసియా క్రీడల్లో 70 పతకాలకు మించి తెచ్చుకోని పరిస్థితిని అధిగమించి ఏకంగా వంద పతకాలను కూడా దాటి, మొత్తంగా 107 పతకాలను కైవశం చేసుకుని 'భారత్ జయహో' అంటూ భారత కీర్తిపతాకను మనవాళ్ళు రెపరెపలాడించారు. టెన్నిస్, బ్యాడ్మింటన్, క్రికెట్, షూటింగ్, అథ్లెటిక్స్ వంటి అనేక క్రీడా విభాగాల్లో మనోళ్ళు అదరగొట్టారు. స్వర్ణాలు సైతం అందుకుని అహో అనిపించారు. గతంలోకంటే మిన్నగా ఈసారి 28 స్వర్ణ పతకాలు, 38 రజత, 41 కాంస్య పతకాలు సాధించడం భారత్ ప్రత్యేకత. అందులోనూ పతకాల సాధనలో వంద దాటడం, భారత్ నాలుగోస్థానంలో నిలవడం ఒక గొప్ప విజయమే. ఈ విజయసాధనలో తెలుగోళ్ళు కూడా ఉండడం విశేషం. అయితే, ఆసియా క్రీడలంటేనే చైనాదే అగ్రస్థానం అన్నమాట క్రీడాలోకంలో ఎప్పటినుంచో స్థిరపడిపోయింది. అందుకు తగ్గట్టుగా చైనా ఏకంగా 201 స్వర్ణపతకాలు, 111 రజత- 71కాంస్య పతకాలతో కలిసి మొత్తం 383 పతకాలను సాధించి మళ్ళీ ఈసారి కూడా తనకు తిరుగే లేదనిపించుకుంది. జపాన్ మొత్తం 188 పతకాలు సాధిస్తే, దక్షిణ కొరియా 190 పతకాలను కైవశం చేసుకుంది. మనది నాలుగోస్థానం. 45 దేశాల నుంచి 12,407 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ క్రీడోత్సవంలో 665 మంది మెరికలైన భారత క్రీడాకారులు పోటాపోటీగా ఆడుతూ ఈ క్రీడల్లో తమ సత్తా నిరూపించుకున్నారు. ఆర్చరీ, రోయింగ్, కబడ్డీ, హాకీ వగైరాల్లో కూడా తామేమీ తక్కువ తినలేదంటూ అద్భుత క్రీడాప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. కబడ్డీ, క్రికెట్‌లలో మెరుపులు మెరిపించారు. స్వర్ణాలు సాధించారు. హాకీలో పురుషుల జట్టు పసిడిపతకాన్ని వడిసిపట్టుకుని, వచ్చేఏడాది ప్యారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సంపాదించింది కూడా. షూటింగ్‌లో ఈషాసింగ్, ఆర్చరీలో జ్యోతి సురేఖ, బ్యాడ్మింటన్‌లో సాత్విక్ సాయిరాజ్, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, చెస్‌లో కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, హరికృష్ణ తదితర తెలుగుతేజాలు అద్భుత విజయాలతో పతకాలు సాధించి భారత కీర్తిపతాకను సగర్వంగా ఎగురవేయడం తెలుగువారందరికీ గర్వకారణం. అయితే, మొత్తంగా ఈ క్రీడల్లో భారత్‌కు వచ్చిన స్వర్ణపతకాలు కేవలం 28 మాత్రమేనన్నది గమనార్హం. దేశవ్యాప్తంగా లక్షలాదిగా వ్యాయామశాలలు పెట్టి, క్రీడల్లో ఎంతోకాలం నుంచి ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తున్న చైనాతో పోల్చుకుంటే, క్రీడాజగత్తులో మనం ఎక్కడున్నామో అర్థమవుతుంది. అయితే, అంతమాత్రాన బెంగపడిపోనక్కర లేదు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో క్రీడలకు అంతగా ప్రోత్సాహం లేకున్నా తమకున్న వనరులు, శక్తియుక్తులతోనే క్రీడాకారులు ప్రపంచ క్రీడారంగంలో తమ నైపుణ్యాన్ని చాటుకుంటున్నారన్న మాట వాస్తవం. అదే సంకల్పంతో మునుపటిరోజుల్లో కంటే మెరుగ్గా మన క్రీడాకారులు ముందుకు సాగుతున్నారనేందుకు ఈ క్రీడలే ఒక నిదర్శనం. ఇదెంతో ఆశావహ పరిణామం. ఇదే స్ఫూర్తితో, వచ్చే ఏడాది జులైలో జరిగే ప్యారిస్ ఒలిపిక్స్ లోనూ మన క్రీడాకారులు విజయాలు సాధించి, పతకాల పంట పండిస్తారని ఆశిద్దాం.

మనదేశంలో క్రీడారంగానికి ప్రోత్సాహం నామమాత్రమే. క్రీడాకారుల ఉత్సాహమే ఊపిరిగా మన క్రీడారంగం ముందుకు సాగుతోంది. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో ఉద్దండులైన క్రీడాకారులున్నా ఆణిముత్యాల్లాంటి ఆటగాళ్ళను ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. స్వార్థరాజకీయాలు, సంకుచిత తత్వాలు వదిలేసి, ప్రతిభా గీటురాయిగా ఉన్న గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను కూడా సానపడితే, వారికి కాస్తంత ఆత్మవిశ్వాసాన్ని, ప్రోత్సాహకాలను ఇవ్వగలిగితే ఇంకా ఎన్నో పతకాలు మన చేతికి అందివస్తాయనడంలో అనుమానం అక్కరలేదు. ప్రభుత్వాలు ఇకనైనా ఆ దిశలో ఆలోచించి అన్ని ప్రాంతాల క్రీడాకారులకు ఉత్సాహ ప్రోత్సాహాలను అందించగలిగినప్పుడే భారత్‌కు పతకాల పంట పండుతుందనడంలో అతిశయోక్తేమీ లేదు!...

## ఈ దుష్ట రాజకీయాలలోకి వై.ఎస్. పేరు తేవడం సిగ్గుచేటు!

గత నెలరోజులుగా అంటే, చంద్రబాబు అరెస్టు తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ రాజకీయపార్టీల నేతలు మరీ దిగజారుడుతనాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు, నాయకురాళ్లు ఒకరినొకరు దూషించుకుంటున్న విధానం జుగుప్సాకరంగా ఉంటోంది. వాళ్ళలో వాళ్ళు ఎక్కడచచ్చినా అది వారిష్టం. కానీ, వారి విమర్శల మధ్యలోకి దివంగతులైన మహా నాయకుల పేర్లు తెస్తున్నారు. తెలుగుదేశం నేతలు మరీ దిగజారిపోయి మహానేత రాజశేఖరరెడ్డి పేరు పదే పదే ఉచ్చరిస్తున్నారు. ఆయన హెలికాప్టర్ ప్రమాదాన్ని వారి విమర్శలలో ఉటంకిస్తున్నారు. భువనేశ్వరి సమక్షంలో ఏడేళ్ల బాలుడిచేత వై.ఎస్. మరణం గురించి మాట్లాడించారు. "అయ్యా జగన్‌మోహన్‌రెడ్డి... తిరుమల వెంకటేశ్వరస్వామి సాక్షిగా చెప్తున్నాం, మీ నాన్న మాంసమైనా దొరికింది, మీది అది కూడా దొరకదు" అంటూ చిన్న పిల్లకుంక చేత మాట్లాడించారు. ఇలా ఆలోచించే వారికి మానం, మర్యాదా, బుద్ధి, జ్ఞానం ఉంటే వై.ఎస్. పాలనకి వాళ్ళ నాయకుడి పాలనకి పోలికపెట్టి మాట్లాడించాలి. ఈ వ్యర్థ ప్రేలాపనలు పేలే చోటా మోటా లీడర్లు వై.ఎస్. కాలి చిటికిన వేలు గోటికి కూడా సరితూగరు. చంద్రబాబు అరెస్టుని మహానేత మరణాన్ని పోల్చి విమర్శలు చేస్తే వున్న అరా కొరా సింపతీకూడా లేకుండా పోయి, వీళ్ళ అడ్రస్సులు గల్లంతయ్యే ప్రమాదముంది. తస్మాత్ జాగ్రత్త!

పి.జె.ఆర్.సుబ్బారెడ్డి, నెల్లూరు.




## కష్టాలకి కేరాఫ్‌గా ఆత్మకూరు బస్టాండు ప్రాంతం!

స్టోన్‌హౌస్‌పేట సమీపంలోని పాత బస్టాండు, అనాదిగా ఆత్మకూరు బస్టాండుగా ప్రసిద్ధి చెంది, ఆ తరువాత ఆర్టీసీ బస్టాండుగా మారిన సంగతి జిల్లావాసులకు తెలిసిందే. అయితే, ఆ బస్టాండు లోపలగానీ, బయట వున్న పరిసర ప్రాంతాలు గానీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. బస్టాండులో ఉన్న పార్కింగ్ విధానం బాగాలేదు. ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా బస్సులు ఆపేస్తున్నారు. అలాగే, దుకాణాల నిర్వహణలో పరిశుభ్రత కనిపించదు. బస్టాండు ప్రాంగణమంతా భయంకరమైన కంపు. ఇక బస్టాండు బయట ట్రాఫిక్‌తో వాహనదారులకు నరకం కనిపిస్తోంది. ఇక్కడ ఆటోల వారి మామూళ్ళకి అలవాటుపడిన ట్రాఫిక్ పోలీసులు వారిని ఇష్టారాజ్యంగా వదిలేశారు. బస్టాండు ప్రాంతం కావడంతో ఒక పద్ధతీపాడూ లేకుండా రోడ్డుకి అడ్డంగా ఆటోలను ఆపి ప్యాసింజర్లని ఎక్కించుకుంటుంటారు. ఇతర వాహనదారులు ప్రశ్నిస్తే బూతుల పురాణం వల్లిస్తుంటారు. ఖాకీ తమనేం చేయలేదన్న ధీమా. గ్రామాలనుండి నగరానికి, నగరం నుండి గ్రామాలకి రోజుకి కొన్ని వేలమంది ప్రయాణించే ఈ ప్రాంతాన్ని ఇలా నిర్లక్ష్యం చేయడం అటు అధికారులకి, ఇటు ప్రజానేతలకి తగదు. బస్టాండు లోపల బస్సులని, బయట ఆటోలని ఒకే క్రమ పద్ధతిలో వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నగర ప్రతిష్టని ప్రతిబింబింపచేసే ఈ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దాలి!

- షేక్ మస్తాన్ భాష, నెల్లూరుపాళెం.




# రెంటికీ చెడ్డ రేవడిగా వై.ఎస్.షర్మిల!

దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అంటే ఒక సంచలనం. వైఎస్సార్ అంటేనే ఒక బ్రాండ్. రేపటి తరం రాజకీయ నాయకులకు ఆయన పాలన ఒక దిక్సూచి లాంటిది. ప్రజాహితం కోసం పాటుపడాలనుకునే నాయకులకి రాజశేఖరరెడ్డి ఒక రోల్ మోడల్. అలాంటి మహానేత వారసులు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాలలో రెండు విధాలుగా వార్తలలో నిలుస్తున్నారు.

నాన్న మరణం తరువాత ఆయన కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి, పది సంవత్సరాలు తల్లి, చెల్లి, భార్య, పిల్లలు అన్నీ బంధాలూ విడిచిపెట్టి ఏదో ఒక యాత్ర పేరుతో నిత్యం ప్రజాక్షేత్రంలోనే, ప్రజల మధ్యనే తిరిగాడు.

అత్యధిక అసెంబ్లీ స్థానాలు సాధించి 2019లో అనాధాంధ్రా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాడు. ఆ స్థానంలో కూర్చున్నంత వరకూ ఆయనది సాహసోపేత ప్రయాణం. ఆ తరువాత బటన్ నొక్కి ప్రజల అకౌంట్లలోకి లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని పంపిస్తూ, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేత కటకటాలు లెక్కబెట్టిస్తూ, సంచలనాత్మక ముఖ్యమంత్రిగా రాజకీయ రంగంలో ఓ వైపు మెరుస్తున్నారు.

మరోవైపు అదే రాజశేఖరరెడ్డి కుమార్తె రాజకీయ నిర్ణయంలో తప్పటడుగు వేసి రెండు రాష్ట్రాల ప్రజల దృష్టిలో చులకనై, పలుచనై, అభాసుపాలయ్యారన్న చర్చ ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలో నడుస్తోంది!

వై.ఎస్ కుమార్తె షర్మిల వై.ఎస్.కి గారాల పట్టి. ఆయన బ్రతికివుండగా ఎప్పుడూ రాజకీయాలపై ఆసక్తి చూపలేదు. కనీసం ఆవైపు కన్నెత్తి కూడా చూడలేదు. రాజశేఖరరెడ్డి అధికారంలో వున్నప్పుడు షర్మిల భర్త బ్రదర్ అనిల్ పేరు ఒకటి రెండు సందర్భాలలో వినిపించిందే తప్ప, షర్మిల పేరు అస్సలు ఎక్కడా వినపడలేదు. తండ్రి ఆకస్మికంగా మరణించిన తరువాత ఆమె అన్నకి అండగా నిలిచింది. అప్పటికే జగన్‌మోహన్‌రెడ్డి పార్లమెంటు సభ్యుడిగా ఉన్నారు. ఆర్థిక నేరారోపణలతో తన అన్న జగన్‌మోహన్‌రెడ్డి పదహారు నెలలు జైల్లో ఉన్న తరుణంలో జగనన్న వదిలిన బాణాన్ని అంటూ ఉమ్మడి రాష్ట్రంలో వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి జగన్ ఇమేజ్‌ని కాపాడడంతో పాటు కుటుంబ గౌరవాన్ని కూడా ఇనుమడింపచేసిందామె. 'రాజశేఖరరెడ్డి బిడ్డ అనిపించిందని'. వై.ఎస్. కుటుంబ అభిమానులు, అనుయాయులు, అభిమానులు మెచ్చుకునేంతగా షర్మిల తన ఉనికిని చాటుకుంది. 2019 ఎన్నికల తరుణంలో 'బయ్... బయ్ బాబూ' అంటూ ఆమె ఇచ్చిన స్లోగన్ బాగా పాపులారిటీ సంతరించుకుంది. ముఖ్యంగా మహిళా రంగం షర్మిల ప్రసంగాల పట్ల, ఆమె హావభావాల పట్ల ఆకర్షితమయ్యింది. జగన్‌మోహన్‌రెడ్డికి చేకూరిన అద్వితీయమైన విజయానికి షర్మిల కృషి కూడా చాలా దోహదం చేసిందనడంలో సందేహం అవసరం లేదు.

## 2019 తరువాత :

జగన్ చేతిలోకి అధికారం వచ్చి, ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశాక సీన్ మారింది. అన్నచెల్లెళ్ళ మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. కారణాలు అంతర్గతం. అవేమిటో వాళ్ళిద్దరికే తెలియాలి. ప్రజలకి అవి అనవసరం కూడా. కానీ, వాళ్ళిద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నాయన్న విషయం మాత్రం బహిర్గతమయ్యింది. అన్నతో విభేదించిన తరువాత షర్మిల వేసిన ప్రతీ అడుగు వివాదస్పదమే అయ్యింది. ఆమెను మెచ్చుకున్న రాజశేఖరరెడ్డి అభిమానులే ఆమెను తప్పుపట్టే విధంగా ఆమె కొన్ని నిర్ణయాలను తీసుకుంది. అందులో మొదటిది తన తండ్రిని దారుణంగా విమర్శించిన రాధాకృష్ణ ఛానల్‌కి వెళ్లి ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇవ్వడం. ఇది చాలామంది వై.ఎస్. అభిమానులకి నచ్చలేదు. వారందరిలో ఆమె పలుచనైపోయింది. ఇక రెండవది తనకు తాను తనను తెలంగాణ ఆడపడుచుగా ప్రకటించుకుని, ఆ రాష్ట్రంలో పార్టీ పెట్టడం. ఆంధ్రాలో పార్టీ ప్రకటించి ఉండుంటే ఎలా ఉండేదో...? కానీ, తెలంగాణలో పార్టీ పెట్టడం ద్వారా ఆమె రాజకీయ అపరిపక్వత కలిగిన నాయకురాలిగా మిగిలిపోయింది. టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ వంటి పార్టీలు ఒకదానితో ఒకటి పోటీపడుతూ నువ్వా-నేనా అన్నట్లు ఢీకొంటున్న తరుణంలో ఆంధ్రకి చెందిన వ్యక్తి , అదీ రాజశేఖరరెడ్డి తనయ షర్మిల పార్టీ పెట్టడం తెలంగాణ వాసులకి నచ్చలేదు. ఆమె పాదయాత్రలతో జనం పాదం కలపలేదు, ఆమె పిలుపుతో ఉద్యమాల కోసం ఎవరూ పిడికిలి బిగించలేదు, ఆమె అరెస్టైతే ప్రజలు స్పందించలేదు. ఒకానొక సందర్భంలో 'మీరెళ్ళి గాడిదలు కాసుకోండి' అని ఒక పోలీసు అధికారిని ఉద్దేశించి ఆమె అంటే.. 'ఇప్పుడు అదే చేస్తున్నాం' అని ఆ అధికారి ఇచ్చిన సమాధానం, మరో సందర్భంలో వై.ఎస్. విజయమ్మను పోలీసులు అడ్డగించడం, ఒక కానిస్టేబుల్‌పై ఆమె చేయి చేసుకోవడం వంటి సంఘటనలు వై.ఎస్. కుటుంబ అభిమానుల మనసులను కలచివేశాయి. రాజశేఖరరెడ్డి కుటుంబానికా ఈ దుస్థితి అని విలవిలలాడిపోయాయి.

వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌పార్టీలో విలీనం చేయాలన్న షర్మిల ప్రయత్నాన్ని రేవంత్ అడ్డుకున్నాడు. తెలంగాణ సెంటిమెంటుని తీవ్రంగా వ్యతిరేకించి, రాష్ట్ర విభజనని బలంగా అడ్డుకున్న రాజశేఖరరెడ్డి కూతురు టీ-కాంగ్రెస్‌లోకి వస్తే నష్టమే తప్ప, లాభం లేదని వాదించి కాంగ్రెస్ అధిష్టానాన్ని ఒప్పించడంలో రేవంత్ సఫలమయ్యాడు. షర్మిల కాంగ్రెస్‌పార్టీతో చేతులు కలపడం కూడా మళ్ళీ వై.ఎస్. అభిమానులకు నచ్చలేదు. ఉమ్మడి రాష్ట్రంలో చచ్చిపోయిన కాంగ్రెస్‌ని బ్రతికించి రెండు పర్యాయాలు అధికారంలోకి తెచ్చిన రాజశేఖరరెడ్డి కుమారుడిని జైల్లో పెట్టిన పార్టీగా కాంగ్రెస్‌ని, పచ్చని సంసారంలో నిప్పులు పోసి కళకళాడుతున్న రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్రాని అనాధాంధ్రగా మార్చిన ద్రోహిగా సోనియాని చూసే ఆంధ్రులదృష్టిలో షర్మిల మరింత పలుచనైపోయింది. ఇప్పుడు షర్మిల విలీనం ప్రక్రియ ఆగిపోయింది.


ఇప్పుడు, తెలంగాణ ఎన్నికల నగారా మ్రోగింది. పార్టీని నడిపించడంలో విఫలమయ్యింది కాబట్టి షర్మిల ఒంటరిగా పోటీ చేయలేదు. ఆమె తనని తానే తెలంగాణ ఆడపడుచుగా ప్రకటించుకుంది కాబట్టి, ఇక ఆంధ్రాకి రాలేదు. ముందుకి వెళ్లలేక, వెనక్కి రాలేక రెంటికీ చెడ్డ రేవడిలా మిగిలిపోయింది!

- రాజశ్రీ

# వేదగిరికి.. ఇక పర్యాటక సొబగులు

- 'ప్రసాద్' పథకం కింద అభివృద్ధికి నిధులు
- వెంకయ్య చొరవతో నరసింహకొండకి మహర్దశ





**నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహ కొండలో వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి త్వరలోనే మహర్దశ రానుంది. జిల్లాలోని ప్రసిద్ధ నారసింహక్షేత్రాల్లో ఒకటైన నరసింహకొండ ఇక పర్యాటక సొబగులతో ఆకట్టుకోనుంది.**

భారతదేశం అంతటా పుణ్యక్షేత్రాలను అభివృద్ధి పరచి, ఆధ్యాత్మికతను, పర్యాటకాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో భారత ప్రభుత్వం 2014-15లో ప్రారంభించిన 'ప్రసాద్' పథకం పరిధిలోకి శ్రీ వేదగిరి లక్ష్మీ నృసింహస్వామి దేవాలయాన్ని తీసుకువస్తున్నట్లు ఇటీవల అధికారిక ఉత్తర్వులు వచ్చాయి కూడా. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవ తీసుకుని నరసింహకొండ ఆలయాన్ని ఆ పథకం కింద అభివృద్ధి చేసేందుకు పరిశీలించాలని గతంలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు సూచించడం, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నరసింహకొండ ఆలయాన్ని దర్శించి వెళ్ళడం తెలిసిందే. ఈ నేపథ్యంలో నరసింహకొండను 'ప్రసాద్' పథకం పరిధిలో చేరుస్తున్నట్లు ఇటీవల అధికారిక ఉత్తర్వులు వెలువడడం పట్ల వెంకయ్య ఆనందం వ్యక్తం చేశారు. ఆ ప్రక్రియలో చొరవ తీసుకున్న వారందరికీ ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఎంతో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉన్న ఈ ఆలయం కేంద్ర పథకం ద్వారా మరిన్ని సౌకర్యాలతో శోభాయమానంగా, భవిష్యత్తులో మరెంతో మంది భక్తులకు ఇల వైకుంఠంగా భాసిల్లగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రూ.52 కోట్లతో అభివృద్ధి...

నరసింహకొండ అభివృద్ధికి వచ్చిన ప్రతిపాదనలను కేంద్ర పర్యాటకశాఖ ఆమోదిస్తూ 'ప్రసాద్' పథకం కింద 52కోట్ల రూపాయల నిధిని మంజూరుచేసినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. ఆమేరకు కేంద్ర 'ప్రసాదం' అందుకున్న దైవక్షేత్రాల్లో జిల్లాలో వేదగిరే తొలి క్షేత్రం అనుకోవచ్చు. జిల్లాలోని ఎంతో ప్రాచీనమైన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహక్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దేందుకు, ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకునేందుకు ఆ నిధిని వినియోగించాలని పర్యాటక సూచించినట్లు సమాచారం. ఆ మేరకు త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని భావిస్తున్నారు. ఆలయ అభివృద్ధికి చొరవ తీసుకున్న భారత 13వ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయుడు ముప్పవరపు వెంకయ్యనాయుడుకు ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, జిల్లా దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది అందరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైద్యరంగంలో ఆణిముత్యం..

# డాక్టర్ కలికి స్వాతి

### 'ప్రపంచ అగ్రశ్రేణి పరిశోధకురాలిగా' మరోసారి గుర్తింపు



ప్రపంచ అగ్రశ్రేణి పరిశోధకుల్లో ఒకరుగా నెల్లూరీయురాలు, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాలలో కంటివైద్య నిపుణురాలిగా ఉన్న డాక్టర్ కలికి స్వాతి మరోసారి గుర్తింపు పొందారు. ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్ట్ విశ్వవిద్యాలయం వారు తాజాగా నిర్వహించిన అధ్యయనంలో ఆమెకు ఈ అరుదైన గౌరవం లభించింది. ప్రపంచంలో ఉన్న రెండుశాతం అగ్రశ్రేణి పరిశోధకుల్లో ఒక్క ఎల్‌వి ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థకు చెందిన 13 మంది వైద్యులకు ఈ విశిష్ట గుర్తింపు లభించిందంటూ ఇటీవల ఆసుపత్రి పరిశోధన విభాగాధిపతి డా.సయన్ బసు పేర్కొన్నారు. అందులో డాక్టర్ స్వాతి ఒకరు కావడం విశేషం.

డాక్టర్ కలికి స్వాతి మరెవరో కాదు.. మన నెల్లూరుజిల్లా నివాసి, ప్రముఖ ఆధ్మాత్మికవేత్త, ఇందుకూరుపేట మండలం, కొత్తూరులో అద్వితీయమైన శ్రీ యోగాంజనేయస్వామి, శ్రీ సాయిబాబా దేవాలయాల నిర్మాణదాతలైన కలికి కోదండరామిరెడ్డి - శ్రీలతల కుమార్తె. కంటికి సంబంధించిన క్యాన్సర్ వ్యాధికి అధునాతన చికిత్సలు అందించడంలోనూ, కంటి ప్లాస్టిక్ సర్జరీల్లోనూ డాక్టర్ స్వాతి అగ్రగణ్యురాలు. వైద్యరంగంలో ఆణిముత్యంగా భాసిస్తున్న ఆమె ఖ్యాతి అంతర్జాతీయస్థాయిలో ఇప్పుడు మరోసారి మార్మోగుతోంది. ఇప్పటికే ఆమె రాసిన ఎన్నో పరిశోధనాత్మక వ్యాసాలు అంతర్జాతీయ పత్రికల్లో ప్రముఖంగా ప్రచురితమయ్యాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆమె పాల్గొనడం, 16కు పైగానే విశిష్టమైన అవార్డులను అందుకోవడం ఆమె ప్రతిభాపాటవాలకు నిదర్శనం. ప్రపంచ అగ్రశ్రేణి పరిశోధకురాలిగా మరోసారి గుర్తింపునందుకుని, వైద్యరంగంలో సింహపురిసీమకే కాక, తెలుగుగడ్డకే గర్వకారణంగా నిలిచిన డాక్టర్ కలికి స్వాతికి..'లాయర్' శుభాకాంక్షలు.



# నిరాధార బాలలపై... డాక్టర్ ప్రేమ్‌రెడ్డి 'వాత్సల్య'ం

### రూ. 60 లక్షలతో ఆశ్రమానికి కొత్తవెలుగులు

**నెల్లూరు నగరంలోని జనహిత-వాత్సల్య సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న నిరాధార బాలలు, వృద్ధుల ఆశ్రమంపై అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత వైద్యులు, మన నెల్లూరీయులైన డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డితో పాటు, వారి కుటుంబసభ్యులందరూ ఎనలేని అభిమానం చూపుతూ, దాని అభివృద్ధికి రూ. 60 లక్షల రూపాయల నిధిని కేటాయించి అత్యాధునిక వసతులను ఏర్పాటుచేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఆ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి కూడా. అమెరికాలో ఉంటూనే వారు ఆ పనులన్నిటినీ వర్చువల్‌గా వీక్షిస్తూ ప్రత్యేకశ్రద్ధతో పనులు చేయించడం 'వాత్సల్య పట్ల' అనాథల పట్ల వారికున్న అపారమైన వాత్సల్యానికి నిదర్శనం.**

డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి..అంటే, పేరుకు తగ్గట్టుగా ప్రేమసాగరుడే. అందులోనూ మానవీయ హృదయం ఉన్న 'సేవాసాగరుడు' కూడా. అమెరికాకే కాదు ప్రపంచ వైద్యరంగానికే ఆయన మణిమకుటం లాంటివారు. నెల్లూరుజిల్లాలోని మారుమూల గ్రామం.. వెంకటాచలం మండలం నిడిగుంటపాళెంలో పుట్టి, కిరోసిన్ దీపాల వెలుగులోనే చదువుకుని, అనితరసాధ్యమైన ప్రతిభాపాటవాలతో వైద్యరంగంలో అపారఖ్యాతి గడించి, అమెరికాలో ఎన్నో వైద్యసంస్థలను స్థాపించి ప్రపంచంలోనే అగ్రగామి వైద్యనిపుణులుగా పేరు గడించిన మానవతాదీప్తి ఆయన. హృద్యోగ వైద్యనిపుణులుగా ఆయన వేలాదిమంది ప్రాణాలను నిలబెట్టారు. అమెరికాలో 50కి పైగానే వైద్యసంస్థలను నెలకొల్పి, లక్షలాది మంది రోగులకు వైద్యసేవలందిస్తున్న ఘనత ఆయనకే దక్కింది.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి'..అన్నట్లుగా డాక్టర్ ప్రేమ్‌కు మాతృదేశమన్నా, జన్మభూమి అన్నా మరింత మక్కువ. అందుకే పుట్టినగడ్డకు సేవచేయాలనే సంకల్పంతో స్వగ్రామానికి, నెల్లూరుసీమకు తనవంతు చేయూతనందిస్తున్నారు. గత ఏడాది ఆయనకు నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అమోఘమైన పౌరసన్మానం లభించింది. ఉత్తర అమెరికా తెలుగు సమితి(నాటా) ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా జరిగిన ఆ సన్మానం సింహపురీయుల హృదయాల్లో ఇట్టే నిలిచిపోయింది. ఆ సందర్భంగా ఆయన తన కుటుంబంతో సహా నెల్లూరుకు వచ్చారు. అదే సందర్భంలో అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో, టాంపా నగరంలో నివసిస్తున్న 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి కుమార్తె మాలినిరెడ్డి 'వాత్సల్య' సంస్థకు లక్ష రూపాయల విరాళం ప్రకటించి అందజేశారు. దాంతో స్ఫూర్తిపొందిన ప్రేమ్‌రెడ్డి కుటుంబసభ్యులు మరుసటి రోజు వాత్సల్య ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న సేవలను చూసి స్పందించి, వారి జీవితాల్లో తామూ భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో వాత్సల్య అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పానికి వచ్చారు. ఆనాటి వారి సందర్శనే నేడు వాత్సల్య అభివృద్ధికి వెలుగుబాటలు వేస్తోంది. దాదాపు 35 ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ అనాథాశ్రమంలో ఎందరో బాలలు ఆశ్రయం పొందారు. అనేకమంది బాగా చదువుకుని జీవితాల్లో స్థిరపడ్డారు కూడా. ఇప్పటికీ ఈ ఆశ్రమంలో 84 మంది చిన్నారులు, 26 మంది వృద్ధులు ఉన్నారు. మరో 250 మంది పేద విద్యార్థులు డే-స్కాలర్స్‌గా కూడా చదువుకుంటున్నారు. అయితే, ఆ కట్టడాలు కాలక్రమంలో మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఆ భవనాన్ని డాక్టర్ ప్రేమ్‌రెడ్డి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తున్నారు. ఆ పనులను అమెరికాలో నిరంతరం పనివత్తిడితో ఉన్నప్పటికీ డాక్టర్ ప్రేమ్ స్వయంగా వాట్సప్ వీడియోల ద్వారా పర్యవేక్షిస్తూ తగు సూచనలిస్తుండడం విశేషం. ఎందరో ఉంటారు ధనసంపన్నులు.. అయితే ఇలాంటి దానగుణ సంపన్నులు ఎందరుంటారు?.. డాక్టర్ ప్రేమ్ మనవారు కావడం సింహపురి చేసుకున్న అదృష్టమే మరి!..



# నెల్లూరు కబుర్లు

## చెస్‌లో చిచ్చరపిడుగు..సాయికృష్ణ

### ఆలిండియా టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు



ఇందుకూరుపేట జీవీకే చిన్మయ విద్యాలయ స్కూల్‌కు చెందిన 6వ తరగతి విద్యార్థి పెరెచర్ల హరిరావ్‌ సాయికృష్ణ చెస్‌లో చిచ్చరపిడుగు అనిపించాడు. నెల్లూరులో ఈ నెల 8న 314 మంది క్రీడాకారులతో జరిగిన ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అగ్రశేణి అంతర్జాతీయ సీనియర్ క్రీడాకారులతో పోటీపడి 7 రౌండ్లలో 7పాయింట్లు సాధించి విజేతగా నిలిచి, 10 వేల రూపాయలు బహుమతిని కూడా పొందాడు. ఈ సందర్భంగా సాయికృష్ణను, శిక్షణ ఇచ్చిన కోచ్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డిని, తల్లిదండ్రులు ఉదయ్ బాస్కర్, దీప్తిలను నెల్లూరులో రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ అభినందించారు.

## 14న డికెడబ్ల్యులో జాబ్‌మేళా

నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో ఈనెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ కంపెనీల వారు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైనవారికి ఉద్యోగాలిస్తారని, 10 నుంచి డిగ్రీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతీయువకులు పాల్గొనవచ్చని, వివరాలకు 879081 31232, లేదా 93981 26555 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ సి.విజయ్‌వినీల్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## నిరాశ్రయులకు అన్నదానం

నెల్లూరులోని పాత మునిసిపల్ కార్యాలయంలో ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ఈనెల 10న అన్నదానం చేశారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి కాంతయ్య పాల్గొని నిరాశ్రయులకు సేవలందిస్తున్న కేర్ టేకర్లను సన్మానించారు. ఏఆర్డీపీడీ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి దాసరి సుందరం, మేనేజర్ మదన్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

### జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చివేసే పేద ప్రజల గృహ నిర్మాణం, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులను కోరారు. ఈనెల 10న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వాటిని ప్రజలకు సకాలంలో అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించడం లేదని జడ్పీ సభ్యులు ఈ సందర్భంగా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇళ్ళు కట్టుకున్నవారికి బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు.బిల్లులు చెల్లించకపోవడంతో రోడ్ల దుస్థితి కూడా చాలాచోట్ల దయనీయంగా ఉందన్నారు. ఈ సమావేశాల్లో శాసనమండలి సభ్యులు పి.చంద్రశేఖర్ రెడ్డి, జడ్పీ సీఇఓ భూపతి చిరంజీవి తదితరులతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు జీతాలు.. ఇంకా ఎప్పుడిస్తారు?

అక్టోబర్ 10వ తేదీ గడిచిపోయినా ప్రభుత్వ ఉద్యోగులు అనేకమందికి ఇంకా జీతాలు రాలేదని, ఇంకా ఎప్పుడిస్తారని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పిఆర్‌టియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.వెంకటరాజు, తిరుమలయ్య ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి జీతాలందక ఉద్యోగులు నానా అవస్తలు పడుతున్నారని, ప్రభుత్వం నుంచి న్యాయంగా తమకు రావాల్సిన బకాయిలను అడిగినందుకు ఉద్యోగులను ఇలా ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదని పేర్కొన్నారు. ఏడాదిగా పిఎఫ్ రుణాలు రానేలేదని, 18 నెలలుగా ఏపీజిఎల్ఐ రుణాలతోపాటు చివరి చెల్లింపులు జరగలేదని, ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా గత నాలుగు నెలలుగా జీతాలివ్వలేదని, జీతాలు ఇవ్వకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ప్రశ్నించారు.



## పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ప్రశంసలు

కేసులను ఛేదించడం, నిందితులను అరెస్ట్ చేయడం, పెండింగ్ కేసులను పరిష్కరించడం తదితర అంశాల్లో ఉత్తమ ప్రతిభ చూపుతున్న పలువురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కె. తిరుమలేశ్వరరెడ్డి ఈనెల 10న ప్రశంసించారు. ఉదయగిరి సీఐ గిరిబాబు, నెల్లూరు రూరల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఆత్మకూరు సీఐ వేణు, కావలి 2వ పట్టణ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, నెల్లూరులోని వేదాయపాళెం, నవాబుపేట ఇన్స్‌పెక్టర్లు నారాయణ, బాబి తదితరులకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

## న్యాయవాదుల నిరసన

కోర్టులో పిటిషన్ అప్లికేషన్‌కు రూపాయి స్టాంప్‌తో పాటు, 20 రూపాయల స్టాంపు కూడా వెయ్యాలన్న ఏపీ బార్ కౌన్సిల్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఈనెల 6 నుంచి విధులు బహిష్కరించి నిరసనలు తెలియజేస్తున్నారు. అయినా, ఏపీ బార్ కౌన్సిల్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈనెల 10న తమ కౌన్సిల్ సభ్యులతో సమావేశమై చర్చించామని, ఈ నెల 16వ తేదీ వరకు విధులు బహిష్కరించాలని నిర్ణయించామని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్‌లు తెలిపారు.

## బాక్సింగ్ కోచ్‌గా..విశ్వనాథ్



జాతీయ క్రీడల్లో రాష్ట్ర బాక్సింగ్ జట్టుకు నెల్లూరు క్రీడాప్రాధికార సంస్థకు చెందిన ఆర్. విశ్వనాథ్ కోచ్‌గా ఎంపికయ్యారు. గోవాలో ఈ నెల 25 నుంచి నవంబరు 9వ తేదీ వరకు జరిగే క్రీడల్లో బాక్సింగ్ జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరిస్తారని డిఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఖేల్ ఇండియా పోటీల్లో ఏపీ జట్టుకు ఆయన కోచ్‌గా ఉండి మన క్రీడాకారులు పతకాలు పొందేందుకు తగు శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 76వ భాగం




ధర్మరాజు తన సమస్త ఐశ్వర్యాన్ని కోల్పోయాక, శకుని జూదం ఆపేసి, నీ దగ్గరేముందో చెబితే తప్ప ఆడనంటాడు. ధర్మరాజుకి పౌరుషం వచ్చి సమస్త సామ్రాజ్యాన్ని పణంగాపెట్టి ఓడిపోతాడు. తర్వాత వరుసక్రమంలో భీమార్జున నకుల సహదేవులను ఒక్కొక్కరిగా పందెం పెట్టి ఓడిపోతాడు. చివరికి తనను తాను ఒడ్డి ఓడిపోతాడు. శకుని ఇంకా దురాశతో పాంచాలి దేవి ఉంది కదా, ఆమెను పణంగాపెట్టి ఈ దాస్య విముక్తిని పొందమని ఆశపెడతాడు. ధర్మరాజు అంగీకరించి పందెం వేసి ఓడిపోతాడు. సభాసదులందరు అవాక్కయిపోతారు. దుర్యోధనుడు విదురుణ్ణి పిలిచి ద్రౌపది ఇక నుంచి దాసి అయ్యిందని, తీసుకురమ్మని ఆదేశిస్తే.. విదురుడు కోపంతో దుర్యోధనుడిని హెచ్చరిస్తాడు, మృత్యువుతో చెలగాటమాడుతున్నావని. దుర్యోధనుడు ప్రాతికామీ అనే సేవకుణ్ణి పిలిచి, ద్రౌపదిని తీసుకురమ్మని పంపుతాడు. ద్రౌపది ప్రాతికామీతో తిరిగి వెళ్లి ధర్మరాజు తనోడి నన్నోడెనా, లేక నన్నోడి తనోడేనా అని అడిగి రమ్మంటుంది. దానికి ధర్మరాజు ఏమి సమాధానం చెప్పకపోతే, దుర్యోధనుడు మళ్లీ ప్రాతికామీని పంపి ద్రౌపదిని ఇక్కడికి వచ్చి అడగమని పంపిస్తాడు. ద్రౌపది జుట్టు ముడివేసుకొని ఏకవస్త్రంతో బయలుదేరి సభకు వచ్చి ధృతరాష్ట్రుని ప్రక్కన నిలబడుతుంది.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**






## ఏబీవీపీ ఆందోళన



రాష్ట్రప్రభుత్వం విద్యారంగ సమస్యలు పట్టించుకోవడం లేదని, పీజీ విద్యార్థులకు రీఎంబర్స్‌మెంట్‌ను దూరం చేస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిందని, ప్రభుత్వ హాస్టళ్లలో పేద విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేవని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసపుచ్చిందని నిరసన వ్యక్తం చేశారు ఏబీవీపీ విద్యార్థులు. నెల్లూరులో ఈనెల 9న 'చలో కలెక్టరేట్' కార్యక్రమం చేపట్టి పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. దీంతో ఉద్రిక్తపరిస్థితి ఏర్పడడంతో పోలీసులు కలుగజేసుకుని ఆందోళనకారులను అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కన్వీనర్ అశోక్‌రెడ్డి, నగర కార్యదర్శి రాహుల్, ప్రవీణ్, త్రినాథ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## జీవనశైలిలో మార్పులవల్లే మధుమేహం

ఆధునిక జీవనశైలిలో వస్తున్న మార్పుల వల్ల, క్రమబద్ధంగా లేని ఆహారపు అలవాట్లతో మధుమేహ వ్యాధి బాగా విస్తరిస్తోందని, ఈ వ్యాధి పట్ల అందరూ అవగాహన చేసుకుని వ్యాధి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రి సీనియర్ ఫిజీషియన్, ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ రవీంద్రరెడ్డి సిద్ధు చెప్పారు. ఈనెల 8న ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మధుమేహం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ వ్యాధి ప్రభావం కంటిచూపుపై కూడా పడుతుందని, అది అంధత్వానికి దారితీస్తుందని చెప్పారు. కళ్ళు, కిడ్నీలు, గుండె తదితర అవయవాలను దెబ్బతీసే ఈ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలితో మధుమేహం వంటి వ్యాధులను నియంత్రించుకోవచ్చని సూచించారు.



దత్తత తీసుకున్న బాలుడు, బాలికలతో దీపమ్మ

# అనాధలకు అమ్మ.. మన దీపమ్మ!

## ○ దత్తత తీసుకున్న ఆడబిడ్డకు వివాహం
## ○ అయిదుగురు బాలికలకు తల్లీతండ్రీ..అన్నీ దీపమ్మే



ఢిల్లీలో అక్షర విద్యార్థులతో దత్తత బాలిక

**"దీప".. పేరుకు తగ్గట్టుగా ఆమె ఆనాధలకు వెలుగుదీపం. సేవకు పతాక.. మానవతకు ప్రతీక. ఒక్కమాటలో చెప్పాలంటే.. దీపమ్మంటేనే.. అనాధలకు అమ్మగా అవతరించిన మానవతాశిఖరం. క్రమశిక్షణ, అంకితభావం, సమాజానికి సేవలందించాలనే ప్రగాఢ సంకల్పం ఆమెది. అనాధలను, అసహాయులను, దివ్యాంగులను ఎందరినో చేరదీసి వారి కష్టాలు తనవిగా భావిస్తూ, వారికి తనవంతు చేయందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేస్తున్న సేవాదీపం..ఆమె. తమ తండ్రి, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సేవాగుణాన్ని పుణికిపుచ్చుకున్న దీపమ్మ, నాన్నగారి సూచనలతో స్వర్ణభారత్ ట్రస్ట్ పేరుతో సేవాసంస్థను ఏర్పాటుచేసి, ఎంతోమంది దీనులను ఆదుకుంటోంది. అందుకే, ఆమె పేరు దీపావెంకట్ అయినా, అందరూ 'దీపమ్మా' అని అభిమానంతో పిలుచుకుంటారు. ఓ కుటుంబానికి చెందిన అయిదుగురు ఆడపిల్లలు దురదృష్టవశాత్తూ తల్లితండ్రులను కోల్పోయి అనాధలైతే, ఆ అయిదుగురినీ పెంచి పెద్దచేసి, వారిలో ఒక అమ్మాయికి ఇటీవల వివాహం కూడా చేసి వారి జీవితంలో వెన్నెలవెలుగైంది దీపమ్మ. ఆమె సహృదయతకు ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే.**



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న దీపమ్మకు చిన్నతనం నుంచే సేవాభావం అలవడింది. తల్లి తండ్రి లేక బతుకే అంధకారంగా తయారైన ఎందరో అనాధలకు, వికలాంగులకు, చిన్నారులకు తనవంతు సేవలందిస్తుండడం ఆమె నిత్యకృత్యంగా మారింది. ఇటీవల తిరుపతిలో ఓ అనాధ యువతికి జరిగిన ఓ పెళ్ళి వేడుక..ఆమె సేవాభావానికే కాదు, మానవీయ హృదయానికి నిలువెత్తు నిదర్శనం.

ఆడపిల్లలంటేనే ఒక పెద్ద భారంగా తల్లితండ్రులు తలచే నేటిరోజుల్లో.. దత్తత తీసుకున్న ఆడబిడ్డను పెంచి పెద్దచేయడమే కాకుండా, విద్యాబుద్ధులు నేర్పించి ఆ తర్వాత వివాహం కూడా జరిపించి ఆ అనాధ యువతికి అండగా నిలిచింది దీపమ్మ. అంతే కాదు, ఆమె పేరుతో లక్ష రూపాయలు డిపాజిట్ చేయడంతో పాటు, ఆ యువతికి కొన్ని బంగారు నగలు కూడా కానుకగా అందజేసి అమ్మకంటే ఎక్కువగా తన మానవీయతను చాటుకుంది ఈ సేవాదీపం.



నీకు అండగా నేనున్నానంటూ ఆశీర్వదిస్తున్న దీపమ్మ

అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు మండలం నిడుంపల్లె అనే గ్రామానికి చెందిన నిరుపేద రజక కుటుంబానికి చెందిన శివయ్య-బుజ్జమ్మలకు అయిదుగురు ఆడపిల్లలు సంతానం. కొడుకు పుట్టాలనే కోరికతో కుటుంబనియంత్రణ పాటించకపోవడం, వరుసగా వారికి అయిదుగురూ ఆడపిల్లలే పుట్టడంతో కుటుంబాన్ని పోషించుకోలేక బాధలు పడడం తల్లితండ్రుల వంతైంది. అయితే, మద్యానికి బానిసైన శివయ్య కొన్నేళ్ళ క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, ఆ పిల్లలను పోషించలేక ఆ తర్వాత కొన్ని రోజులకే ఆయన భార్య బుజ్జమ్మ కూడా ఆత్మహత్య చేసుకుంది. దీంతో అయిదుగురు అక్కాచెల్లెళ్ళు శిరీష, ప్రసన్న, మల్లీశ్వరి, నందిని, లిజితలు అనాధలుగా దిక్కులేని పక్షులుగా మిగిలారు. అప్పటికి వారి వయస్సు కేవలం 3 నుంచి 8 ఏళ్లలోపే. అంతా పసిపిల్లలు. వారి దయనీయస్థితిని మీడియా ద్వారా తెలుసుకున్న దీపమ్మ మానవీయ హృదయం చలిచింది. ఆ అనాధ బాలికలకు 'నేనున్నా' నంటూ ముందుకొచ్చి ఆ అయిదుగురు బాలికల్నీ 2016లో దత్తత తీసుకుంది. వారికి అన్నీ తానే అయి, అమ్మలా వారిని తమ అక్కున చేర్చుకున్నారామె. వారి చదువుల భారాన్ని తనమీదే వేసుకుని స్వర్ణభారత్ ట్రస్టులో వారిని చదివిస్తూ, వారికెప్పుడు ఏం కావాలో సమకూరుస్తూ అందరినీ పెంచి పెద్దచేసింది. మొదటి అమ్మాయి శిరీషకు పెళ్ళివయసు రావడంతో ఆమెకు ఇటీవల తిరుపతిలో దగ్గరుండి వివాహం కూడా జరిపించి, కొత్త దంపతులను ఆశీర్వదించింది. ఆపెళ్ళి వేడుకలో దీపమ్మతో పాటు, ఆమె కుమారుడు విష్ణు, స్వర్ణభారత్ ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు. మిగిలిన నలుగురు అమ్మాయిలకు కూడా తానే వివాహం జరిపిస్తానని కూడా దీపమ్మ సంతోషంగా తెలిపారు.

అంతేకాదు, నాగపూర్‌కు చెందిన ఓ నాలుగేళ్ళ బాలుడిని కూడా గతంలో దీపమ్మ దత్తత తీసుకున్నారు. ట్రస్టుతో సంబంధం లేకుండా ఆ బాలుడిని కన్నబిడ్డలాగా పెంచి పెద్దచేసిందామె. ఇప్పుడా బాలుడు పెరిగి పెద్దవాడై, చదువు పూర్తిచేసుకుని స్కిల్ ట్రైనింగ్ విభాగంలో రాణిస్తూ, స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనే పనిచేస్తున్నాడు. ఇలా ఎందరో అసహాయులకు, అనాధలకు తోడునీడై నిలుస్తున్న దీపమ్మ సేవాభావానికి.. కరుణార్ద్ర హృదయానికి జేజేలు పలుకుతోంది 'లాయర్'!...



తిరుపతిలోని వరుని ఇంటికి వచ్చి భరోసానిస్తున్న దీపమ్మ

## అందరి సహకారంతో..
# అమ్మవారి జాతర విజయవంతం
**—నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రపండుగ హోదాలో ఇటీవల వెంకటగిరిలో పెద్దఎత్తున నిర్వహించిన శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర అందరి సహకారంతో విజయవంతంగా జరిగిందని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. జాతర విజయానికి సహకరించిన కమిటీ మెంబర్లను ఆయన ఈ సందర్భంగా వెంకటగిరిలోని తమ నివాసంలో ఇటీవల అభినందించి సన్మానించారు. అమ్మవారి కండువాతో పాటు పోలేరమ్మతల్లి చిత్రపటాన్ని, ప్రసాదాలను ఆయన వారికి బహుకరించారు. ఇదేవిధంగా సమన్వయంతో కలిసి పనిచేస్తే విజయం సాధించవచ్చునని. ఆ దిశగా పయనించి వెంకటగిరి అభ్యున్నతికి అందరం కలసి కృషిచేద్దామని చెప్పారు.


# ఆమంచర్లలో వైద్యసేవలపై ఆర్డీఓ ఆరా

నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్లలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఇటీవల ఆర్డీఓ మలోల సందర్శించారు. ఆరోగ్యపరీక్షల కోసం శిబిరానికి వచ్చినవారితో మాట్లాడారు. వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయో లేదో ఆరా తీశారు. రూరల్ ఎంపీపీ విజయకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్లాస్టిక్‌కు బదులు..
# జనపనార సంచులు

ప్లాస్టిక్ పర్యావరణాన్ని దెబ్బతీస్తుందని, ప్లాస్టిక్ కవర్లకు బదులు జనపనార సంచులు వాడాలని కోరుతూ, ఈనెల 10న ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కంపెనీ (ఓఎన్‌జీసి) వారు వింజమూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జనపనార సంచులను అందజేశారు. ధరణి సేవాసమితి ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్ధాలను వివరించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, ప్లాస్టిక్ ముప్పును అవగాహన చేసుకొని ఆ దిశగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నివారణకు నడుం బిగించాలని ఆయన కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ సంచులను వాడవద్దని సూచించారు. బయ్యపురెడ్డి శివ, కాటం నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



# వింజేటమ్మ కొండకు..మరింత వైభవం



## ○ రూ.2.35 కోట్లు మంజూరుచేసిన సీఎం

**- రాష్ట్ర రైతు సాధికారత కో-ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి**



*భక్తుల కొంగుబంగారం, వింజమూరు గ్రామశక్తి శ్రీ వింజ పరమేశ్వరి అమ్మవారు కొలువైవున్న వింజేటమ్మ కొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి, ఆ ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి భక్తులకు మరిన్ని వసతులు కల్పించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.35 కోట్ల రూపాయలు మంజూరు చేయడంతో వింజేటమ్మ కొండకు ఇక త్వరలోనే మరింత వైభవం రానుంది. 15వ శతాబ్దినాటి ఈ ఆలయం వింజమూరుకు నైరుతి దిక్కున రిజర్వుడు అటవీప్రాంతంలో ఉండడంతో భక్తుల వసతులకు, ఆలయ అభివృద్ధికి ఇంతకాలంగా అనేక ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు ప్రభుత్వం ఎకో టెంపుల్ టూరిజం కింద నిధులు మంజూరుచేయడం, అటవీశాఖ వారు కూడా తగు అనుమతులిచ్చి అభివృద్ధి పనులను ప్రారంభించడం శుభపరిణామం. రాష్ట్ర రైతు సాధికారత కోఆర్డినేటర్, వైకాపా నాయకుడు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి చొరవతో ఈ కార్యక్రమాలన్నీ రూపుదిద్దుకోవడం విశేషం.*

మండల కేంద్రమైన వింజమూరులో వెలసివున్న శ్రీ వింజపరమ్మేరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి సిఎం జగన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి, నిధులు మంజూరుచేశారు. రాష్ట్ర రైతు సాధికారత కోఆర్డినేటర్, వైకాపా నాయకుడు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 9న ఆ పనులు ప్రారంభమయ్యాయి కూడా. డిఎఫ్ఓతో పాటు వింజమూరులో ఆయన ఇటీవల విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వింజేటమ్మ పేరుతోనే వింజమూరు ఏర్పడిందని, వింజమూరు గ్రామదేవత అయిన వింజేటమ్మ ఆలయానికి రాష్ట్రవ్యాప్త ఖ్యాతిని, వైభవాన్ని తీసుకురావాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి సూచనలతో ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నామని, అందుకు తగిన అనుమతులు కూడా రావడంతో పనులు ప్రారంభించామని చెప్పారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన భవనం, తాగునీటి వసతి తదితర మౌలిక వసతులు సమకూరుస్తామన్నారు. తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో వలె వింజేటమ్మకొండపై కూడా గిరి ప్రదక్షిణకు ఉన్న అవకాశాలను పరిశీలించి, అందుకు తగ్గట్లుగా భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలనే ఆలోచన కూడా ఉందన్నారు. ఆలయం పరిసరాల్లో ఉన్న వాగు పైభాగంలో ఉన్న రహదారికి ఇప్పుడు మరమ్మతులు చేపట్టామని, భవిష్యత్తులో ఆ వాగుపై వంతెన నిర్మించేందుకు కూడా కృషిచేస్తామని ఆయన చెప్పారు. అమ్మవారి ఆలయంలో నిత్య పూజాకార్యక్రమాలను నిర్వహిస్తూ భక్తులకు నిరంతరం అమ్మవారి దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్న కె.కొండారెడ్డి, డి.కొండారెడ్డిలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. రేంజ్ ఆఫీసర్ తుమ్మల ఉమాశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ పల్లాల కొండారెడ్డి, జి.చంద్రారెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం - డిఎఫ్ఓ చంద్రశేఖర్

ప్రభుత్వం మంజూరుచేసిన నిధులతో వింజేటమ్మ ఆలయ ప్రాంతాన్నంతా సర్వాంగసుందరంగా రూపుదిద్దుతామని జిల్లా అటవీశాఖ అధికారి (డిఎఫ్ఓ) చంద్రశేఖర్ తెలిపారు. రహదారుల సౌకర్యంతో పాటు, ఆలయంలో ఉన్న కట్టడాలను ఆధునీకరించడమే కాక, అవసరమైన మరిన్ని కట్టడాలను నిర్మిస్తామన్నారు, ఇక్కడున్న అటవీ ప్రాంతాన్ని సుందరీకరిస్తామని, చిల్డ్రన్‌పార్కు, యోగా సెంటర్, టూరిజం బంగ్లా తదితర సదుపాయాలు కల్పిస్తామని, భక్తుల వసతులకు, అదేవిధంగా ఈ ప్రాంతంలో ఉన్న జింకలు, నెమళ్ళు తదితర వన్యప్రాణుల సంరక్షణకు కూడా చర్యలు తీసుకుంటామని డిఎఫ్ఓ తెలిపారు.

---

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

## జెండా మహోత్సవం.. గూడూరుకే ప్రత్యేకం





దసరా ఉత్సవాలకు దేశంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. దసరా ఉత్సవాలు, జెండా మహోత్సవంలో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్న ప్రాంతం గూడూరు. ఆ పరంపరను కొనసాగిస్తూ ఈ ఏడాది వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలంటూ ఆంజనేయస్వామి విగ్రహ రూపంతో కూడిన చిత్రాన్ని భారీ జనసందోహం మధ్య ఊరేగించడం ఇక్కడ ఆనవాయితీ. మరెక్కడా లేని విధంగా గూడూరు పట్టణంలో జెండా పండుగ నిర్వహిస్తారు. దసరా ఉత్సవాలకు పదిరోజులు ముందుగా వచ్చే మహాలయ అమావాస్య రోజున పురవీధుల్లో వందకుపైగా ఆంజనేయస్వామి జెండాలతో యువత పోటాపోటీగా ఊరేగింపు చేపడతారు. సాంస్కృతిక కార్యక్రమాల సందడి అంబరాన్నంటుతుంది. విద్యుత్ దీపాలంకరణలు, జనసందోహం మధ్య పట్టణంలో భక్తి పారవశ్యం వెల్లివిరుస్తుంది. గూడూరులో 1948లో జెండా ఉత్సవాన్ని తొలిసారిగా ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ నెల 14వ తేదీన నిర్వహించే జెండా ఉత్సవానికి ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తిచేశారు. పట్టణంలోని ప్రధాన అమ్మవారి దేవాలయాల్లో కళశాలను ఏర్పాటు చేయడం ఆనవాయితీ. తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించి దసరా రోజు భారీ ఊరేగింపులు, గ్రామోత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.






## మన దేశ కళ.. భరత నాట్యం



గూడూరులో డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఇటీవల జరిగిన పిండి మల్లిక అధ్వర్యంలో శ్రీ శివ లలిత భరతనాట్య కళాక్షేత్రం సంస్థ భరతనాట్య కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కాగా, మల్లిక ద్వారా శిక్షణ పొందిన కళాకారులు న్యూఢిల్లీలో ప్రతిభ చాటి సరికొత్త రికార్డు నమోదు చేశారు. దీంతో స్వచ్ఛాంధ్ర ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ, మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి వారిని అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా దేవసేనమ్మ మాట్లాడుతూ మన దేశ కళ అయిన భరతనాట్యాన్ని నేటి తరం యువతకు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న మల్లికకు తమవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ మన దేశ కళలు సైన్స్‌తో ముడిపడి ఉంటాయనడానికి ఉదాహరణ భరతనాట్యం అన్నారు. ఈ కళ నేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన వ్యాయామం లభిస్తుందని వివరించారు. అనంతరం సన్మానాలు జరిగాయి. యోగా మాస్టర్ మురళీకృష్ణ, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ముని గిరీష్, టివిఎల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ



చేగువేరాను స్ఫూర్తిగా తీసుకొని యువత సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. వేములపాలెం ప్రాంతంలోని పేదలకు చేగువేరా జయంతి సందర్భంగా ఆర్డీవో కిరణ్‌కుమార్ చేతులమీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్ బాబు, ఆదినారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అన్వర్ భాషా, నరేష్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, కిషోర్, అజయ్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.



## అనురాగేశ్వరుడు

నటనకు ఆకృతి అయినవాడు
నటనకు ప్రాకారం కట్టినవాడు
నటనను అభిషేకించిన పరీమళ
సుగంధమై ప్రవహించినవాడు
ఆ నట వసంతుని నటవిద్యకు
రాళ్ళు కన్నీటి నదులవుతాయి
వాటకంలో విస్పష్టత
ఆర్తిని నింపుకొన్న హృదయంతో
ఆవిష్కరించే 'ప్రేమ' విలువిద్యకు
ఆకాశమే వంగి వంగి సలాం చేస్తుంది.
గుండెల నిండా గాలిని నింపుకొని
అనర్గళంగా బెలూన్ ఊదినట్లు
చేయి తిరిగిన నట విరాట్‌స్వరూపం అతగాడే
ఆ కళ్ళు ప్రేమైక భావాల పొదరిళ్ళు
ఆ చూపులు కురిసే నెగళ్ళు
యుగళగీత సంద్రంలో నదియై ఒదిగి పోతాడు
ప్రేమగీతాల్లో ఇంద్రచాపమై భాసిస్తాడు
విరహంలో తాపసిగా తపించిపోతాడు
ఆ సంభాషణా చాతుర్యపు నిగారింపు
నిండైన దృశ్యకావ్యం కాన్వాసుపై చెక్కినట్లు
రంగుల రసమయం చేసినంత తన్మయంగా
గుండె తలుపులు బదలుకొట్టిన నటనాగ్రేసరుడు
ప్రేక్షకుడి కంటతడిని తన వాచకంగా
చేసుకొన్న శిఖర సమానుడు
ఆయన చూడని లోతుల్లేవు
ఆయన చూపని అభినయాల్లేవు
ఆయన ఎక్కని ఎత్తుల్లేవు
అనురాగేశ్వరుడై వెండితెరను
శాసించిన ధీరోధాత్త కావ్య నాయకుడు
జనం గుండెల్లో పతాకమైన నటకేసరి
మరణంలేని... మరణం రాని
తెలుగుతెర సిరి!



**చిన్ని నారాయణరావు**
**9440202942**

(కీ॥శే॥ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా)

# 'వనంతోపు'కు మురుగునుంచి విముక్తి



మురుగుగుంటగా దుర్గంధంతో నిండివున్న నగరంలోని వనంతోపు ప్రాంతానికి ఎట్టకేలకు మురుగునుంచి విముక్తి కలుగుతోంది. ఎంతోకాలంగా పూడిపోయిన పంటకాలువ పూడిక తీసి శుభ్రం చేస్తున్నారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదాల అధికారులను ఆదేశించడంతో ఈ ప్రాంతం బాగుపడేందుకు మార్గం సుగమమైంది. ఎంతో కాలంగా నెల్లూరు 20వ డివిజన్‌లో వనంతోపు నుండి ఎర్రకోనేటి మిట్ట మీదుగా కొండాయపాళెం వెళ్లే ప్రధాన పంట కాలువ పూర్తిగా పూడిపోయి, వర్షాలు పడగానే వనంతోపు ప్రాంతమంతా మురుగునీటి ప్రవాహం చేరుతోంది. మురుగునీళ్లతో పాటు పాములు కూడా ఇళ్ళల్లోకి వచ్చేస్తున్నాయని ఆ ప్రాంతప్రజలు ఇటీవల నెల్లూరు ఎంపీ, రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం ద్వారా తమ కష్టాలు తెలియజేసుకున్నారు. వెంటనే ఆదాల సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యను తీర్చాలని ఆదేశించడంతో, 20వ డివిజన్ వైకాపా నాయకులు, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్ఆర్), సంబంధిత అధికారులు, శానిటేషన్ అధికారులు సురేంద్ర, శ్రీనివాసులు, సతీష్ తదితరులంతా వచ్చి ఆ పంట కాలువను, వనంతోపు ప్రాంతాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని ప్రారంభించడంతో స్థానిక ప్రజలు ఆదాలకు, అధికారులకు తమ ధన్యవాదాలు తెలిపారు.

# సాత్వికకు సన్మానం



సామాజిక సేవలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచి ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డుతోపాటు, లక్ష రూపాయలు నగదు బహుమతిని అందుకున్న పెళ్లకూరు సాత్వికను కోవూరులో ఇటీవల వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి అభినందించి ఘనంగా సన్మానించారు. కోవూరు కోనమ్మతోటకు చెందిన న్యూ లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని పెళ్లకూరు సాత్విక కోవూరు మండలానికి వన్నె తెచ్చే విధంగా సామాజిక సేవ చేస్తూ రాష్ట్రపతి అవార్డును అందుకోవడం గర్వకారణమని ఆయన అభినందించారు. సాత్విక చదువుకున్న స్కూలు కరస్పాండెంట్ మైథిలి కిషోర్‌కు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి.. ఎస్‌బిఐ వితరణ



స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వారు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ప్రతి ఏటా పర్యావరణ పరిరక్షణకు, చిన్నపిల్లల సంరక్షణకు, మహిళల ఆరోగ్యానికి, పేద బడుగు వర్గాల వారికి తమవంతు చేయూతనందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న నెల్లూరు రంగనాయకుల పేటలోని ఇసుకడొంకలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి ఒక వాటర్ ప్యూరిఫయర్‌ను, టెలివిజన్‌ను, ఫ్యాన్‌ను తమ వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్, డీజీఎం వరదరాజన్, రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు, ఏజీఎం లక్ష్మి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.




# జపాన్‌లో రాజ్యసభ సభ్యులు.. బీఎంఆర్

ఫిక్కీ ఫోరమ్ ఆఫ్ పార్లమెంటేరియన్స్ ప్రతినిధి బృందంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు(బీఎంఆర్) ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) ఆహ్వానం మేరకు ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లారు. అక్టోబర్ 9 నుండి 13వ తేదీ వరకు ఆయన అక్కడ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈనెల 9న జపాన్‌లో భారత రాయబారి సిబి జార్జ్ భారత పార్లమెంటేరియన్ల బృందానికి టోక్యోలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, ఈ సమావేశాల ద్వారా భారత్-జపాన్‌ల మధ్య ఆర్థిక సంబంధాలు బలపడతాయన్నారు. అదేవిధంగా, ఈనెల 10న ఈ బృందం టోక్యోలో జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి నిషిమురా యసుతోషిని కలిసింది. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, జపాన్‌కు భారతదేశం అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జపాన్ దేశంలోని పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించేందుకు ఆహ్వానిస్తున్నారని, ఇప్పటికే 6 జపనీస్ కంపెనీలు శ్రీసిటీలో ఉన్నాయని, కొత్తగా జపనీస్ బహుళజాతి ఎయిర్ కండిషనింగ్ తయారీ కంపెనీ డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, దాని అతిపెద్ద సంస్థను స్థాపించేందుకు శ్రీసిటీలో భూమిపూజ చేసిందని తెలిపారు. లోక్‌సభ సభ్యులు రాజీవ్ ప్రతాప్ రుడి ఆధ్వర్యంలో బీఎంఆర్‌తో పాటు సుశీల్ కుమార్‌మోడీ, సంగీత ఆజాద్, హేమంత్ పాటిల్, రమ్య హరిదాస్, జయంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# ఉచితవైద్య శిబిరం



అల్లూరు మండలం నార్త్ మోపూరులోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, సంతానం లేని దంపతులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి తగు సూచనలిచ్చారు. నెల్లూరులోని సిద్ధార్థ నర్సింగ్‌హోం సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో డాక్టర్ ఎన్.సిద్ధార్థ, డాక్టర్ జి.శ్వేత తదితరులు పాల్గొని 40 మందికి వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీచేశారు. ట్రస్టు ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, డాక్టర్ జెట్టి రమేష్, ట్రస్టు మేనేజర్ ఇందుపూరు అనిల్ కుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం



ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల స్థానిక బీవీనగర్‌లో ఉన్న డాక్టర్ మల్లెల రామయ్య కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ప్రముఖ ఫిజియోథెరపీ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, మనదేశంలో 45 కోట్లకు పైగా ప్రజలు మానసిక రుగ్మతలతో, రకరకాల వైకల్యంతో బాధపడుతున్నారని, మానసిక ఆరోగ్యం పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రజలకు అవగాహన కోసం ర్యాలీని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజా షామిలి, వైస్ ప్రిన్సిపాల్ ప్రతిమ, అనూష తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల ఆందోళన

ఆశా కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని కోరుతూ మండల కేంద్రమైన మనుబోలులో పీహెచ్‌సి వద్ద ఈనెల 8న ఆశాకార్యకర్తలు ఆందోళన చేశారు. మండల ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ, చాలీచాలని జీతాలతో ఎంతోకాలంగా ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారని, పెరుగుతున్న ధరలతో తమ బతుకులు దుర్భరంగా తయారయ్యాయని, ప్రభుత్వం ఇకనైనా తమ దుస్థితిని పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం, పీహెచ్‌సి వైద్యుడు సుబ్బరాజుకు తమ డిమాండ్లతో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఆందోళనలో పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## టూకీగా...



### ఓరేపల్లిలో ఆరోగ్యసేవలపై కేంద్రబృందం ఆరా

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, వ్యాధినిరోధక టీకాలు వగైరాలన్నీ సక్రమంగా అందుతున్నాయో లేదోనంటూ సైదాపురం మండలం ఓరేపల్లి గ్రామంలో కేంద్రబృందం ఇటీవల సర్వే నిర్వహించింది. బృంద నాయకురాలు తులసిజ్యోతితో పాటు 8మంది సభ్యులు ఇల్లిల్లూ తిరిగి ఆరోగ్యసేవలను ఆరా తీశారు. జిల్లా నోడల్ అధికారి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### పెనుబల్లిలో 'ఆరోగ్య సురక్ష'

బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలోని పెనుబల్లి గ్రామంలో వైద్యసిబ్బంది ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు ఆరోగ్యపరీక్షలు చేసి అవసరమైనవారికి ఉచితంగా మందులిచ్చారు.

### ముదివర్తిలో పోషకాహారంపై అవగాహన

విడవలూరు మండలంలోని ముదివర్తి గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.రమణి ఆధ్వర్యంలో ఇటీవల గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కలిగించారు. గర్భిణులు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటూ, మంచి ఆహారం తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తిరుపతిమ్మ, రాజసులోచన, శీనమ్మ, లావణ్య, శారద, హేమలత తదితరులు పాల్గొన్నారు.

### కలువాయిలో 'నా భూమి-నా దేశం'

మండలకేంద్రమైన కలువాయిలో ఇటీవల జడ్పీటీసీ బొలిగాకుల అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ గోవర్ధన్, ఇఓపీఆర్డీ నారాయణ, ఏఓ రాజశేఖర్, ఎంఆర్‌సి సునీల్‌రెడ్డి తదితరులంతా కలిసి 'నా భూమి-నా దేశం' కార్యక్రమం చేపట్టారు. 20 గ్రామాల నుంచి మట్టి తీసుకునివచ్చి ఆ మట్టిని-బియ్యాన్ని కలిపి కలశంలో నింపారు. వాటిని త్వరలో ఢిల్లీకి తీసుకువెళ్తామని చెప్పారు.

### పడుగుపాడు సచివాలయంలో రికార్డుల పరిశీలన

కోవూరు మండలం పడుగుపాడు సచివాలయాన్ని ఇటీవల తహశీల్దార్ పద్మజ ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని, 'స్పందన'లో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

### ఇందుకూరుపేటలో వ్యవసాయ సలహామండలి సమావేశం

మండల కేంద్రమైన ఇందుకూరుపేటలోని రైతుభరోసా కేంద్రంలో ఇటీవల వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. మండలి ఛైర్మెన్ వాకాటి ప్రసాద్, వైకాపా నాయకుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొని రైతులకు తగు సూచనలిచ్చారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులంతా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

### అల్లూరులో రేషన్ దుకాణం సీజ్

అల్లూరులోని ఓ రేషన్ దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు ఈనెల 7న ఆకస్మికంగా తనిఖీచేసి సీజ్ చేశారు. రేషన్ సరుకుల నిల్వలపై అవకతవకలున్నట్లు గుర్తించి అధికారులు ఆమేరకు చర్యలు తీసుకున్నారు.

### చిట్టేడు గిరిజన గురుకుల విద్యార్థుల క్రీడాప్రతిభ

కోట మండలంలోని చిట్టేడు గ్రామంలోని పలువురు గిరిజన గురుకుల విద్యార్థులు ఇటీవల నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన క్రీడాపోటీల్లో ప్రతిభతో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శుభకర్, పీఇటి రామ్మూర్తిలు అభినందించారు.

### ముక్తాపురంలో పెన్ననుంచి ఇసుక మాయం

సంగం మండలం ముక్తాపురం గ్రామం వద్ద పెన్నానది నుంచి ఇటీవల రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తోలుకుపోతున్నా అడిగేనాథులు లేరని, పొర్లుకట్టలు తెగ్గొట్టి మరీ ఇసుక తరలించేస్తున్నారని గ్రామంలో గగ్గోలుగా ఉంది.

# అక్కడ పోరు – ఇక్కడ జోరు

(మొదటి పేజీ తరువాయి)

## తెలంగాణలో చివరి అంకానికి చేరిన కథ!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి అక్కడ కల్వకుంట్ల చంద్రశేఖరరావు నాయకత్వంలోని బి.ఆర్.ఎస్.(ఒకప్పుడు టీ.ఆర్.ఎస్) పార్టీ అధికారంలో ఉంది. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అయినా, తెచ్చింది తామే అన్న సెంటిమెంటును బలంగా తెరపైకి తెచ్చి రెండుసార్లు అధికారాన్ని చేజిక్కించుకుంది కేసీఆర్ పార్టీ. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పార్టీపైనా, పాలన పైనా సహజంగానే వ్యతిరేకత వస్తుంది. అదే తరుణంలో రెండు పర్యాయాలు ప్రతిపక్షంలో కూర్చున్న పార్టీలలో గెలుపుపై కసి కూడా అంతే స్థాయిలో ఉంటుంది. కాబట్టి, ఈసారి తెలంగాణ ఎన్నికలని అంత ఆషామాషీగా తీసేయడానికి వీలు లేదు. నువ్వా-నేనా అన్న పోరు చివరి అంకానికి చేరి ఎన్నికల వేళకి మరో నలభై రోజులే ఉంది కాబట్టి, ఇక తెలంగాణ ఓటర్లకు ప్రతిరోజూ పండగే!

## ఆంధ్రాలో సైన్యాన్ని సిద్ధం చేస్తున్న జగన్!

ఆరు నెలల ముందే ఆంధ్రా సీఎం జగన్ సమర శంఖం ఊది తన సైన్యాన్ని సిద్ధం చేశారు. ప్రతినిధుల సదస్సు పేరుతో పార్టీ శ్రేణులందరినీ విజయవాడకు పిలిపించుకున్నారు. అక్టోబర్ నుండి మార్చి వరకూ అలుపెరుగకుండా నాయకులు, కార్యకర్తలు చేయవలసిన కార్యక్రమాలను వారికి వివరించారు. 'చెప్పినవన్నీ చేశాం, చెప్పనివీ చేశాం... కాబట్టి మనకి మరోసారి దీవించమని అడిగే హక్కుంది' అంటూ ఇదే విషయాన్ని గడప గడపకి తీసుకు వెళ్ళమని సూచించారు. 'వై నాట్ 175' అన్న దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ 10 వరకు కొనసాగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష, అక్టోబర్ 25 నుండి మొదలుకానున్న సామాజిక బస్సు యాత్రలు, నవంబర్ 1 నుండి 'వై ఏపీ నీడ్స్ జగన్', డిసెంబర్ 11 నుండి 'ఆడుదాం ఆంధ్రా', జనవరి 1 నుండి పెన్షన్ పెంపు సంబరాలు, జనవరి 10 నుండి వైఎస్సార్ చేయూత, జనవరి 20 నుండి వైఎస్సార్ ఆసరా వంటి కార్యక్రమాలతో ప్రజలలోకి వెళ్లాలని మొత్తం పార్టీ నాయకత్వాన్ని, శ్రేణుల్ని ఉత్తేజ పరుస్తూ... స్ఫూర్తిని కలిగించారు. ఫిబ్రవరిలో 'మళ్ళీ జగనన్ననే తెచ్చుకుందాం' అంటూ మ్యాని ఫెస్టోని రూపొందించుకుని ఫిబ్రవరి నుండి ఎన్నికల నగారా మోగే వరకూ 'ప్రజలలోనే ఉందాం' అంటూ పిలుపునిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నికల వేడి మొదలై తెలంగాణలో పోరు, ఆంధ్రాలో జోరు పెరిగాయి.

## రాష్ట్రమంతా పోటీ చేస్తాం.. - వై.ఎస్.షర్మిల

### బరిలో విజయమ్మ, అనిల్ కూడా?

మొత్తానికి రాజన్న బిడ్డ తెగించారు. రాజకీయాలలో తాడో పేడో తేల్చుకోవాలని సిద్ధపడిపోయినట్లున్నారు. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి ఎన్నికల బరిలో దిగాలన్న ఆమె ప్రయత్నం ఫలించకపోవడంతో, ఆమె సొంతంగా మొత్తం 119 నియోజక వర్గాలలో అభ్యర్థులను పోటీలో పెట్టాలని నిర్ణయించుకున్నారు.

గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆమె ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. 119 నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇస్తాం. ఆసక్తి ఉన్నవాళ్ళు బి-ఫామ్‌ల కోసం దరఖాస్తు పెట్టుకోవచ్చు అని షర్మిల పిలుపునిచ్చారు. నేను పాలేరు నుంచి పోటీ చేస్తాను. రెండో చోట నుంచి కూడా పోటీ చేయాలని డిమాండ్ ఉంది.. ఆలోచిస్తాను. బ్రదర్ అనిల్‌ని, విజయమ్మని కూడా పోటీలో పెట్టాలని చాలామంది అడుగుతున్నారు. అవసరం అనిపిస్తే అనిల్, విజయమ్మ కూడా పోటీ చేస్తారు. ఓట్లు చీలిస్తే కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతాడు అని అనుకున్నాం. అందుకే కాంగ్రెస్‌తో చర్చలు జరిపాం, కానీ వాళ్ళు కలిసి రాలేదు అని షర్మిల చెప్పారు. రాష్ట్రంలో మళ్ళీ వైఎస్సార్ సంక్షేమ పాలన తీసుకువస్తామని, ప్రజలు తమ పార్టీని ఆశీర్వదించాలని ఆమె కోరారు.

మొత్తం మీద 2023 డిసెంబర్ మాసం దేశ రాజకీయాలలో చాలా కీలకం కాబోతోందన్నది విశ్లేషకుల అభిప్రాయం. నవంబరులో జరగనున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, సిక్కిం, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కేంద్రంలో బీజేపీ భవిష్యత్తును సూచిస్తాయని విశ్లేషకులు అంటున్నారు!

# 'మోషా'ల లీలలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో బీజేపీ ఫైరింగ్ మొదలయ్యింది. అయితే, తుపాకీని కేంద్ర ఎన్నికల సంఘం భుజం మీద పెట్టి, ఏకే 47తో మోడీ బృందం కాల్పులకి దిగింది. 'ఆరు.. నూరైనా సరే, సంతలో సరుకును కొనైనా సరే'... తెలంగాణలో ప్రభుత్వ పాలనావకాశాన్ని చేజిక్కించుకోవాలని ప్రధాని పదవిలో ఉన్న మోడీ, హోంమంత్రి పదవిలో ఉన్న అమిత్ షా... తెలంగాణ పాలనా యంత్రాంగంపై విరుచుకుపడట్టు కనిపిస్తోందని పరిణామాలను గమనిస్తున్న వారు వ్యాఖ్యానిస్తున్నారు.

నిజానికి, నిజం అనేది ఒకటి కావచ్చు, జనం అనుకునేది మరొకటి కావచ్చు. జనం అనుకునేదే ముఖ్యం తప్ప, నిజం అన్నది ముఖ్యం కాదు అంటారు... కొందరు.

కారణం ఏమైనప్పటికీ తెలంగాణ ప్రభుత్వ పాలకులను ముప్పతిప్పలు పెట్టి, మూడు చెరువుల నీరు తాగించడానికే కేంద్ర ప్రభుత్వ పాలకులు డిసైడ్ అయ్యారనే చెప్పాలి. ఏకంగా నలుగురు పోలీస్ కమిషనర్లు, పదిమంది జిల్లా ఎస్పీలు, నలుగురు కలెక్టర్లను, ముగ్గురు రాష్ట్రస్థాయి ఐఏఎస్‌లను ఎన్నికల విధుల నుంచి తొలగించారు. ముక్కుసూటిగా, నిజాయతీ నిబద్ధతతో పనిచేసేవారు కూడా బీజేపీకి కోపం తెప్పించిన వారి తొలి జాబితాలో ఉన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఇందుకు ఉదాహరణ.

## ఈ బదిలీల వల్ల, బీజేపీ ఈ ఎన్నికల్లో గెలుస్తుందా?

కిందటిసారి ఎన్నికల్లో ఒక్క స్థానమే గెలిచింది. ఈసారి 60 గెలవాలి. పోనీ ఒక్క సీటే గెలిచిందనుకుంటే ఇంకో 59 కొట్టుకు రావాలి. ప్రజాస్వామ్యం అంటే... అమ్మకాలు, కొనుగోళ్ళే కదా!

తెలంగాణలో కొరడా ఝుళిపించిన ఎన్నికల కమిషన్, ఆంధ్రలో కూడా ఇంత దూకుడుగా వ్యవహరిస్తుందా అన్న ధర్మసందేహం ఆంధ్రలోని రాజకీయ నాయకులు, ఆసక్తిపరుల మస్తిష్కాలను తొలిచివేస్తోంది.

ఏ కారణాలతో ఎన్నికల సంఘం తెలంగాణ పాలక యంత్రాంగంపై విరుచుకుపడిందో... అవే తరహా కారణాలు ఆంధ్రప్రదేశ్‌లో కళ్ళు మిరుమిట్లు గొలిపే రీతిలో... దీపావళి మతాబుల్లా వెలుగులు వెదజల్లుతున్నాయి అని వ్యాఖ్యానించే వారికి, కేంద్రానికి ఫిర్యాదు చేసేవారికి కొదవలేదు. మరి, ఆంధ్రలో కూడా 'ఈ స్థాయి'లో ఎన్నికల సంఘం అధికారులను ఎన్నికల విధుల నుంచి తొలగిస్తుందా?

కేంద్రంలో అధికారంలో ఉన్న కేంద్ర బీజేపీ 'పెద్దల' ద్వయం కరుణాకటాక్ష వీక్షణాల కోసం చంద్రబాబునాయుడు ఇంతగా ఎందుకు మోకరిల్లుతున్నారనే ప్రశ్నకు... ఇప్పటికే చాలామందికి సమాధానం లభించి ఉంటుంది. కేంద్రంలోని 'పవర్ సెంటర్' గనుక కరుణిస్తే ఎన్నికల సంఘం రంగంలోకి దిగుతుందనే అభిప్రాయం చాలామందిలో ఉంది.

చీఫ్‌సెక్రటరీ నుంచి ఆర్ఐ వరకు డీజీపీ దగ్గరి నుంచి కానిస్టేబుల్ వరకు ఎవరినిపడితే వారిని బదిలీ చేస్తారు. అధికార యంత్రాంగాన్ని భయభ్రాంతులకు గురి చేస్తారు. అందుకే, మో... షాల ప్రసన్నం కోసం చంద్రబాబు ఊహాతీతమైన సహనాన్ని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మాత్రం కేంద్ర పెద్దలను తన 'రాజకీయం'తో బిగించేశారు. వైసీపీని కాదని, టీడీపీ వైపు బీజేపీ మొగ్గుచూపే అవకాశాలు లేవనే భావనే పలువురు పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఏ భావనకూ ముగింపు ఇప్పుడే దొరకడం కష్టం.

కానీ, కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల తొలగింపు మాత్రం తథ్యం అని మాత్రం చెప్పకతప్పదు. ఎంత బీజేపీ అయినా, ఎంతో కొంత పాతివ్రత్యం పాటించాల్సి ఉంటుంది కదా!

తెలంగాణ విషయానికి వస్తే, కేసీఆర్ వ్యతిరేక ఓటు పది రకాలుగా చీలిపోనుంది. బీజేపీ ఒక్కటే కేసీఆర్ ప్రత్యర్థి కాదు. ఇక్కడ కాంగ్రెస్‌పార్టీ పాత్ర కూడా చాలా కీలకం. అత్యంత శక్తివంతమైన కేంద్ర కమలదళం ఒక వైపు, గోకర్ణ గజకర్ణ టక్కుటమారాది రాజకీయ ఎత్తులతో కాంగ్రెస్ ఒకవైపు కల్వకుంట్ల ముక్కుకి తాడు వేయాలని చూస్తున్న తరుణంలో... కేసీఆర్ మహర్జాతకుడా..? కాదా..?? అన్న విషయం డిసెంబర్ మూడు సాయంత్రానికి తెలిసిపోతుంది..!

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో..

# 15 నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 15 నుంచి 49వ శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. 15వ తేదీ ఉదయం 8.46 నుంచి 8.50లోగా చిత్తా నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశంలో కలశ స్థాపన చేస్తారు. దీంతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఉత్సవాల్లో భాగంగా 15న చండీ అలంకారంతో అమ్మవారు దర్శనమిస్తారు. అదేవిధంగా, 16న భవాని, 17న గాయత్రి, 18న అన్నపూర్ణాదేవి, 19న గజలక్ష్మి, 20న సరస్వతి, 21న కాళికాదేవి అలంకారాలతో, 22వ తేదీ దుర్గాష్టమి రోజున శ్రీ దుర్గాదేవి అలంకారంతో అమ్మవారిని పూజిస్తారు. 22వ తేదీ సాయంత్రం మహార్నవమిని పురస్కరించుకుని అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంతో భాసిస్తారు. 23వ తేదీ సోమవారం విజయదశమి సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం విశేషంగా ఉంటుంది. ఆరోజున శమీపూజ, పారువేట ఉత్సవాలతో పాటు, అమ్మవారి నగరోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తారు. ఇప్పటికే ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మన్ రత్నం జయరామ్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, అమ్మవారి భక్తుల పర్యవేక్షణలో ఆలయంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానం చేసి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నిత్యపూజలు, విశేష సేవలు నిర్వహిస్తున్నారు. నిత్యం భక్తుల రద్దీతో అమ్మవారి ఆలయం కళకళలాడుతోంది.

# విశ్వసాయి ఎస్కార్కే స్కూల్‌లో.. న్యూట్రిషన్ డే

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి డా.ఎస్కార్కే స్కూల్‌లో ఈనెల 11న న్యూట్రిషన్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల కూరగాయలు, పండ్లు, విత్తనాలు, చిరుధాన్యాలు, పప్పుదినుసులను ప్రదర్శించారు. వాటి ఉపయోగాలను ఉపాధ్యాయులు వారికి వివరించారు. అనంతరం, స్థానిక మోడరన్ ఐ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటిపరీక్షలు చేసి తగు సూచనలిచ్చారు. స్కూల్ ఛైర్మన్ డా.ఎన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ టి.రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరులోని ఐటిఐ కళాశాలలో ఈ నెల 12న జరిగిన కాన్వొకేషన్ వేడుకల్లో డీఎల్‌టిసి ఐటిఐలో నేషనల్ ఒకేషనల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్. పక్కన కె.వి.ఎస్.ప్రసాద్‌రావు, నెల్‌క్యాస్ట్ డిజీఎం హెచ్‌ఆర్ పళని మురుగన్, కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రావు, శ్రావణ్‌కుమార్ తదితరులు

# కృష్ణానది బోర్డును తరలించొద్దు

కృష్ణానది మేనేజ్‌మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నానికి తరలించడం అనాలోచిత చర్య అని బీజేపీ సమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విమర్శించారు. ఆ బోర్డు కృష్ణానది జలాలతో పాటు తుంగభద్ర, పెన్నా నదుల యాజమాన్య బోర్డులను కూడా పర్యవేక్షిస్తుందని, ఆ మూడు నదుల పరీవాహక ప్రాంతాలకి అందుబాటులో లేకుండా, ఎక్కడో దూరంగా ఉన్న విశాఖపట్నానికి తరలించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం విజయవాడలో ఏర్పడిన కృష్ణానది యాజమాన్య బోర్డును యథాతథంగా విజయవాడలోనే కొనసాగించాలని ఆయన కోరారు. ఆమేరకు నెల్లూరులో జలవనరులశాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించి, ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# డా. సివి రామచంద్రరావు కన్నుమూత



ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, బహుగ్రంథకర్త, విఆర్ కళాశాల చరిత్ర విభాగం విశ్రాంత అధ్యక్షులు డా.సివి రామచంద్రరావు(89) ఈనెల 9న చెన్నైలో కన్ను మూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. డా.సివి చరిత్రలో ఎం.ఏ పట్టాపుచ్చుకుని పలు విశ్వవిద్యాలయాల లోనూ పనిచేశారు. తిరిగి విఆర్‌సిలో చేరి 1993లో రీడర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. సమగ్ర ఆంధ్ర ప్రదేశ్ చరిత్రపై 3 ప్రామాణిక గ్రంథాలను, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో 30 ప్రామాణిక గ్రంథాలను కూడా రచించి విద్యారంగానికి విశేషమైన సేవలందించారు.

# ఎన్‌బికెఆర్‌లో విద్యార్థినులకు అవగాహన సదస్సు

కోట మండలం విద్యానగర్ ఎన్‌బి కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 9న విద్యార్థినులకు పిసిఒఎస్, పిసిఒడి సమస్యల పట్ల అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో కోటలోని సిహెచ్‌సి వైద్యురాలు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రూప ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థి



నులకు తగు సూచనలిచ్చారు. పౌష్టికాహారం తీసుకుంటూ, క్రమం తప్పని వ్యాయామంతో మంచి ఫలితాలు పొంద వచ్చని చెప్పారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్లు డా.ఎస్ ఇందుమతి, డాక్టర్ బి వాసవి తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపికలు

విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల 10(ఎ) నావల్ యూనిట్ అధ్వర్యంలో క్యాడెట్స్ ఎంపికలు నిర్వహించారు. కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సర విద్యార్థులు మొత్తం 60మంది పాల్గొనగా, వారి శారీరక దారుఢ్యం, ఇతర పరీక్షల్లో ఉత్తీర్ణతను బట్టి 20 మంది ఎంపికయ్యారు.

# క్లయిమాక్స్‌కు మోడీ...!?



భారత ప్రధానమంత్రి హోదాలో గత తొమ్మిదేళ్లకు పైబడి ఉన్న పెద్దపులి లాంటి నరేంద్ర మోడీ 'వ్యవహార'శైలి క్లైమాక్స్‌కు చేరుకున్నట్టు కనపడుతోంది. బీజేపీ కంటే తానే అధికుడిని అనే భావం దేశ ప్రజలకు కలగాలి అన్నట్టుగా ఆయన వ్యవహారశైలి ఉందని పరిశీలకులు అంటున్నారు. రాష్ట్రాలలో ప్రభావశీలురైన బీజేపీ ప్రాంతీయ నేతలను పక్కన పెడుతున్నారు. రాజస్థాన్‌లో వసుంధర రాజేను పక్కన పెట్టేశారు. ఆవిడ రాజమాత విజయరాజే సింధియా కుమార్తె. మోడీ దాష్టీకానికి తట్టుకోలేక, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల నుంచి వైదొలుగుతున్నట్టు ఆమె ప్రకటించారు. ఆ కుటుంబం నియోజకవర్గం ప్రజలనుంచి వీడ్కోలు సమావేశం నిర్వహించి మరీ తన నిర్ణయాన్ని ప్రకటించారు.

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్‌కి పెద్దమనిషి, సౌమ్యుడు అనే పేరు ఉంది. మూడవసారి ముఖ్యమంత్రిగా ఉన్నారు. త్వరలో జరగనున్న మధ్యప్రదేశ్ ఎన్నికలకు ఆయనను మోడీ దాదాపు పక్కన పెట్టేశారు.

తెలంగాణలో అధికారపార్టీకి కంటిలోని నలుసులా, చెప్పులోని రాయిలా, చెవిలోని జోరీగలా ఊపిరి సలపనివ్వకుండా విరుచుకుపడుతున్న బండి సంజయ్‌ను హఠాత్తుగా పక్కనపెట్టి, సౌమ్యుడు అనే పేరున్న కిషన్‌రెడ్డిని తీసుకొచ్చారు.

నిజానికి కేంద్రమంత్రిగానే ఆయనను ఉండనిస్తే మంచి పరిపాలనా దక్షుడిగా పేరు తెచ్చుకుని ఉండేవారు. ఇప్పుడు, అటూ... ఇటూ కూడా కాకుండా పోయే ప్రమాదం ఆయనకు కళ్లెదురుగా ఉంది.

కర్నాటకలో ఎడ్యూరప్పను ఇంటికి పంపితే, కర్ణాటక రాష్ట్రం ఏకంగా బీజేపీనే ఇంటికి పంపింది.

ఇవి చాలవన్నట్టుగా, తన అహంభావ ధోరణితో ప్రతిపక్షాలు పెట్టిన బోనులోకి నడుచుకుంటూ వచ్చి చిక్కుకుపోయారు. ప్రతిపక్షాల 'చేతి'కి దొరికిపోయారు.

అహంభావం, ముందుకు బాగా పొడుచుకువచ్చిన 56 అంగుళాల ఛాతి, చూపుల్లో... నడకలో, హావభావాల్లో లెక్కలేనితనమే ఆయన నైజం అన్నట్టుగా మోడీ వ్యవహరిస్తున్నారని ఢిల్లీ మీడియా వర్గాలు వ్యాఖ్యానిస్తుంటాయి. ప్రతిపక్షాలతో కూడా లెక్కలేనితనంతో వ్యవహరించే నరేంద్ర మోడీ, ఇప్పుడు ప్రతిపక్షాలు పన్నిన ఉచ్చులో ఇరుక్కుపోయారు.

పాతికకు పైబడిన ప్రతిపక్షాలు, తమ కూటమికి ఇం.డి.యా అనే పేరు పెట్టుకున్నాయి. గతంలో యూపీఏ అని ఉన్న పేరు స్థానంలో ఇప్పుడు ఇం.డి.యా అన్నమాట.

నిజానికి పాత సీసాలో ఉన్న సారాయినే కొత్త షేప్‌లో ఉన్న సీసాలో పోసి, కొత్త లేబుల్ అంటించి, సేల్‌కు పెట్టారు. అది వారి హక్కు. తప్పు పట్టాల్సిన పనిలేదు. పాత కాలపు 'జనసంఘ్' అనే ముతక చీర స్థానంలో 'బీజేపీ' అనే సిల్క్ చీరను ఆర్ఎస్ఎస్ దేశం మీదికి వదిలినట్టుగా.

అయితే, 'ఇండియా' అనే పదాన్ని దేశంలోని సమస్త వర్గాలకు చెందిన ప్రజలు ఏదో ఒక సందర్భంలో వాడని, మనసులో అనుకోని రోజు బహుశా ఉండదేమో! అందువల్ల, ప్రతిపక్ష కూటమికి అప్రయత్న ప్రచారం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రోజూ వచ్చి పడుతూనే ఉంటుంది.

గతంలో ఈ కూటమికి ఉన్న యుపీఏ అనే పేరు బాగా అప్రదిష్టపాలైంది. దాంతో, దానికి బదులుగా 'ఇండియా' అనే పేరును తెరమీదకు తీసుకువచ్చారు.

ప్రతిపక్షాలు మూకుమ్మడిగా ఒక చోటికి చేరడమే.... బీజేపీకి 'టూ మచ్' అనుకుంటే, కూటమికి దేశ ప్రజలందరి రక్తంలోనే ఉన్న 'ఇండియా' అనే పేరు పెట్టుకోవడం బీజేపీకి 'త్రీమచ్, ఫోర్‌మచ్' అయింది.

దీంతో, బీజేపీకి ఒళ్లంతా కంపరం ఎక్కింది. ప్రతిపక్షాలు బీజేపీని రాజకీయ దురదగుంటాకుతో రుద్దినట్టయింది. 'ఇండియా' అనే పదం ఉచ్చరించకుండా దేశానికి తెల్లవారదు... పొద్దుగూకదు.

అసలు ఇంతమంది ప్రతిపక్ష నాయకులు.... పాత లగేజీలు వదిలేసి... ఒక్క చోటికి చేరడమే తలనొప్పి అనుకుంటుంటే... ఇంటింటికీ నోట్లో నానుతూ ఉండే 'ఇండియా' అనే పేరుతో, తమపై మానసికంగా పైచేయి సాధిస్తాయేమో నన్న బెంగ మోడీ(బీజేపీ)కి పట్టుకుంది.

అప్పటికప్పుడు ఎన్డీఏను బయటకు తీశారు. లేని నవ్వులు తెచ్చి పెట్టుకుని... చిరునవ్వులు చిందిస్తూ ఆ పార్టీల వాళ్లను ఆలింగనం చేసుకుని, 'మేము చిన్నప్పటి నుంచీ ఫ్రెండ్స్‌మే'.. అంటూ ప్రచారం హోరెత్తించారు. వంట గ్యాస్‌పై సిలిండర్‌కు ఓ రెండొందల రూపాయలు తగ్గించేశాం అన్నారు. అయినా, 'ఇండియా' బెదురు బీజేపీకి పోలేదు.

దాంతో, ఆ పదానికి స్పష్టి చెప్పి, 'భారత్' అనే పదాన్ని హఠాత్తుగా బయటకు తీశారు. ఇదేమీ నిషిద్ధ పదం కాదు. లేదా బీజేపీ కనిపెట్టింది కూడా కాదు. మన రాజ్యాంగమే గుర్తించింది. ఇంగ్లీష్‌లో అయితే ఇండియా, హిందీలో అయితే భారత్ అని రాజ్యాంగ పీఠికలోనే పేర్కొన్నారు.

ఏ పదం వాడినా తప్పు గానీ, అభ్యంతరం గానీ లేదు. ఉండడానికి వీలులేదు.

అయితే, 'ఇండియా' అనే పదాన్ని పూర్తిగా కనుమరుగు చేయడానికి నరేంద్రమోడీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టుగా వ్యవహరించడమే అమితాశ్చర్యకరంగా ఉంది.

దేశం పేరును 'భారత్'గా మార్చాలి అనుకుంటే కూడా... నరేంద్ర మోడీ దేశ ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని, తన భావాలను వారితో పంచుకుని ఉండవలసింది. దేశంలోని అన్ని పార్టీలతో సమావేశమై తన అభిప్రాయాన్ని ప్రకటించి ఉండవలసింది. లేదా మొన్న జరిగిన ఎర్రకోట ప్రసంగంలో చెప్పి ఉండవలసింది. 'ఇండియా' అనే పదాన్ని తొలగిస్తూ రాజ్యాంగాన్ని సవరిస్తాం అని చెప్పి ఉండవలసింది. మొన్న కొత్త పార్లమెంట్ భవనంలో జరిగిన మొదటి సమావేశంలో మొదటి తీర్మానంగా దీనిని చర్చించి ఆమోదించి ఉండవలసింది. దేశం మొత్తం హర్షించి ఉండేది. అయినా ఎప్పుడో అమలు చేద్దామని భావించిన మహిళా రిజర్వేషన్ బిల్లును పెట్టి, రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేశారు. చివరకు, అందులోనూ నిజాయితీ కనిపించలేదనే విమర్శలను బీజేపీ మూటగట్టుకుంది.







ఇండియా అనే పదం బదులు 'భారత్' అనే పదాన్ని రాష్ట్రపతి పేరు మీద విడుదలైన ఒక ఆహ్వాన పత్రికలో The President of Bharat అని ముద్రించి ఒక భావోద్వేగ అంశానికి నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. ఎన్నికల నాటికి ఏదో ఒక భావోద్వేగ అంశం లేకపోతే, గెలుపు కష్టం అనుకున్నారో ఏమో... దొడ్డి దారిని ఈ పదాన్ని ప్రవేశపెట్టారు.

పోనీ, ఆ పని అయినా నిజాయతీగా.... రాజకీయాలకు అతీతంగా చేశారా అంటే... అదీ లేదు. ఇందులోనూ రాజకీయ లబ్ది కోసం వెదుకులాట.

ఇండియా పేరును భారత్‌గా మార్చుతున్నట్టు భారత ప్రభుత్వం నుంచి ఓ అధికారిక ప్రకటన లేదు. ఓ మంత్రి కూడా ప్రకటన చేయలేదు. మంత్రివర్గ ఆమోదం ఉన్నట్టు లేదు. ఓ గెజిట్ ప్రకటన లేదు. President of India కాస్త President of Bharat ఎలా అయ్యారో అర్థం కాలేదు.

బాగా రాజకీయ అల్లరి చోటు చేసుకుని, ఒక భావోద్వేగ సమస్యగా రూపాంతరం చెంది... జనంలో ఒక మానసిక విభజనకు ఉపకరించడానికే మోడీ వైఖరి తీరు ఉపయోగపడితే పడవచ్చు.

తెలుగులో ఓ సామెత ఉంది... 'విధం చెడ్డా ఫలితం దక్కలేదు' అని.

ఇండియా అనే పదాన్ని ప్రతిపక్షాలు సొంతం చేసుకున్నాయని.... దానికి బదులు 'భారత్' అనే పదాన్ని నరేంద్రమోడీ బయటకు తీసినా.... దానినీ ఎగరేసుకుపోయే ఆలోచనల్లో ప్రతిపక్షాలు ఇప్పటికే పడిపోయాయి.

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఒక చురక వేశారు. 'మేము ఇండియా అన్నామని బీజేపీ వారు భారత్ అంటున్నారు. రేపు మా కూటమికి భారత్ అని పేరు పెడితే... దేశానికి వాళ్లు బీజేపీ అని పేరు పెడతారా?' అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు BHARAT అనే అక్షరాలకు కావలసిన పదాలను ఏర్చి కూర్చి, తమ కూటమికి భారత్ అని పేరు పెట్టే ఆలోచనను గట్టిగా వినిపించారు.

కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ 'భారత్' అంటే ఏమిటో చెప్పేశారు. Betternent, Harmony, Responsible, Advancement for Tomorrowలోని ఇంగ్లీష్ పదాల మొదటి అక్షరాలు అన్నీ కలిపితే, BHARAT అవుతుంది. ఈ పదం 'ఇండియా' అనే పదం కంటే మరింత శక్తివంతమైనది. చదువు, సంధ్యలు లేని ఉత్తర భారత హిందీ 'ఓటర్ మహాశయుల'కు కూడా ఈ పదం తేలికగా, సూటిగా అర్థం అవుతుంది.

మోడీ గనుక, దేశం పేరును ఇండియా నుంచి భారత్‌గా మార్పు చేస్తే, ప్రతిపక్షాల కూటమి కూడా తమ కూటమికి 'ఇండియా' అనే పదం బదులు, 'భారత్' అనే పదం ఖరారు చేస్తారు. వారి అయాచిత ప్రచారం పది రెట్లు అవుతుంది.

అప్పుడు నరేంద్ర మోడీ... మళ్లీ ఇండియా అనే పేరుకు వెళ్లలేరు కదా!. భారత్ అనే పదంతో ముందుకూ వెళ్లలేరు. కొత్త పేరూ కనిపెట్టలేరు. అప్పుడు, 'భారత్' అనే పదమూ, 'ఇండియా' అనే పదమూ ప్రతిపక్షాల కూటమికి అనధికార పేటెంట్ పదాలుగా మారిపోతాయి. ఎన్నికల దృష్టితో ఎవరు ఈ పదాలను ఉచ్చరించినా... ప్రతిపక్షాల ఖాతాలో మైలేజ్ పడిపోతుంది. నిజానికి, మోడీ తత్తరపాటు చూస్తుంటే... ప్రతిపక్షాల 'ఉమ్మడి దెబ్బ'కు ఆయన దడుచుకున్నారు అనే భావమే చాలామందిలో కలిగింది.

భారతదేశాన్ని ఒక 'హిందూ' మత దేశంగా మార్చాలి అని గట్టిగా భావించే ఆర్ఎస్ఎస్‌కి రాజకీయ స్వరూపం నరేంద్ర మోడీ. ఆ దిశగా, దేశం పేరును 'హిందూస్తాన్'గా ఎందుకు ప్రకటించలేక పోయారా అని ఆశ్చర్యం వేస్తోంది.

అటు పాకిస్తాన్ ముస్లిం దేశం. ఇటు హిందూస్థాన్ హిందూ దేశం. లేదా, అమెరికా పేరు లాగా, 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ హిందూస్తాన్(USH)' గా మార్చినా... అందులో క్రియేటివిటీ ఉండేది.

దేశాన్ని మత భావనలపై 80:20గా విభజింప చేయడానికి, ఇంతకుమించిన 'తారక మంత్రం' ఏముండేది? నిజానికి, మూడోసారి గెలవడానికి మోడీ ఇన్ని పిల్లి మొగ్గలు వేయాల్సిన పని కనబడడం లేదు. నటనా చాతుర్యం ప్రత్యేకంగా అవసరం లేదు.

దేశం చాలా పెద్దది. ప్రపంచ దేశాలలోనే అతిపెద్దది. దేశమంతా ఆయన కలదిరిగినట్టు ఏ ఒక్క ప్రతిపక్ష నేతా తిరగలేరు. విమానాలు, హెలికాప్టర్లు ఆయన కనుసన్నల్లో ఎగురుతుంటాయి. 'జాతీయ' ప్రచార సాధనాలు మోడీ చేతుల్లోనే ఉన్నాయి గానీ, ప్రతిపక్షాల వారికి అందుబాటులో లేవు. మోడీ ప్రదర్శించ గలిగిన హావ, భావ, సత్యాసత్య ఏకపాత్రాభినయ ప్రదర్శనల ముందు బీజేపీ ఇతర నేతలు వినయంగా పక్కకు తప్పుకుంటున్నారు.

"సాగినంత కాలం నా అంతటి వారు లేరందురు...

సాగకపోతే... ఊరిక చతికిల బడిపోదురు..." అని శ్రీకృష్ణ భగవానుడు, భీమసేనుడికి ఊరికే చెప్పలేదు!

- భోగాది వేంకట రాయుడు
శాన్ఫ్రాన్సిస్కో నుండి...
medhomadhanam@gmail.com

VPR CONVENTION CENTRE
వేడుక మీది.. వేదిక మాది

# సంతోష సంబరాల వీచిక

# 10 విపిఆర్ వేదిక పదేళ్ళ వేడుక

అక్టోబర్ 19న దశమ వార్షికోత్సవం సందర్భంగా
ఆదరించి ఆశీర్వదించి ఆనందిస్తున్న అందరికీ
**అభినందనపూర్వక ధన్యవాదాలు.**











**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
రాజ్యసభ సభ్యులు
ఛైర్మెన్, విపిఆర్ ఫౌండేషన్

**వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**
ఛైర్‌పర్సన్,
ఢిల్లీ టిటిడి స్థానిక సలహా మండలి




VPR FOUNDATION | VPR VIDYA | VPR VAIDYAM | VPR Vikas

గొలగమూడిరోడ్డు, కనుపర్తిపాడు, నెల్లూరురూరల్.
ఫోన్: 0861 - 6541414.
www.vprconventioncentre.com

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com